VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 19.06.2026

సంపుటి : 08 సంచిక : 10 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



గౌ || శ్రీ రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు

పి.ప్రసన్నకుమార్ శర్మ ,ప్రధాన కార్యదర్శి ,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

## తెలంగాణలో ఇకపై డిజిటల్ క్యాబినెట్ పేపర్‌లెస్ పాలనకు శ్రీకారం






- మంత్రివర్గ సమావేశాలు ఇకపై పేపర్‌లెస్ విధానంలో
- డిజిటల్ క్యాబినెట్‌కు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌ల పంపిణీ
- ఈ-బుక్ రూపంలో క్యాబినెట్ అజెండా
- పరిపాలనలో సాంకేతికతకు పెద్దపీట
- కాగితం వినియోగానికి గుడ్‌బై
- వేగవంతం కానున్న నిర్ణయాల ప్రక్రియ
- డిజిటల్ గవర్నెన్స్ దిశగా మరో అడుగు
- మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

రాష్ట్ర పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను పూర్తిగా 'పేపర్‌లెస్' విధానంలో నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డిజిటల్ క్యాబినెట్ విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రులు అధికారికంగా ప్రారంభించారు.డిజిటల్ క్యాబినెట్ అమలులో భాగంగా ప్రతి మంత్రికి ప్రత్యేక ట్యాబ్‌లను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఇకపై మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన అజెండా, నోట్లు, ప్రతిపాదనలు, అనుబంధ పత్రాలు అన్నీ ఈ-బుక్ రూపంలో ట్యాబ్‌లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.డిజిటల్ విధానం అమలుతో మంత్రులు ఎక్కడి నుంచైనా సమావేశ అజెండాను ముందుగానే పరిశీలించే అవకాశం లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. నిర్ణయాలకు సంబంధించిన పత్రాలను సురక్షితంగా భద్రపరచడంతో పాటు అవసరమైన సమాచారాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకురావచ్చని అధికారులు వివరించారు. దీంతో పరిపాలనలో పారదర్శకత, వేగం, సామర్థ్యం మరింత పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.అదే సమయంలో కాగితం వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ విధానం దోహదపడనుంది. ప్రతి క్యాబినెట్ సమావేశానికి వేలాది పేజీల ముద్రణ అవసరం లేకుండా ప్రభుత్వ వ్యయం తగ్గడంతో పాటు డిజిటల్ గవర్నెన్స్ లక్ష్యాల సాధనలో ఇది కీలక ముందడుగుగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



## సింగరేణిలో అక్రమాలపై బీజేపీ ఫ్యాక్ట్ ఫైండింగ్..

- సింగరేణిలో అవినీతి, అక్రమాలపై వాస్తవాల సేకరణ
- ఓబీ టెండర్లు, బొగ్గు నిల్వలపై ప్రత్యేక దృష్టి
- కార్మిక సంక్షేమం, కారుణ్య నియామకాలపై ఆరా
- అడ్రియాల ప్రాజెక్టు, సోలార్ పనితీరుపై పరిశీలన

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

సింగరేణి సంస్థలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అవినీతి, అక్రమాలు, టెండర్లలో అవకతవకలపై క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు బీజేపీ శాసనసభాపక్షం ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపుతోంది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం మంచిర్యాల జిల్లాలో పర్యటించి సింగరేణి పరిధిలోని పలు ప్రాంతాలను పరిశీలించనుంది.హైదరాబాద్ నుంచి బయలుదేరే బీజేపీ లెజిస్లేటివ్ టీమ్ తొలుత మంచిర్యాలకు చేరుకుని, అనంతరం సింగరేణి పరిధిలోని వివిధ గనులు, ప్రాజెక్టుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించనుంది. సంస్థలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి వ్యవహారాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాస్తవ పరిస్థితులపై నివేదిక రూపొందించనున్నట్లు పార్టీ వెల్లడించింది.సింగరేణిలో గత కొంతకాలంగా ఓబీ (ఓవర్ బర్డెన్) టెండర్ల కేటాయింపులు, ఎక్సెస్ టెండర్ల ద్వారా సంస్థకు జరిగినట్లు చెబుతున్న ఆర్థిక నష్టం, బొగ్గు నిల్వల్లో వ్యత్యాసాలు, 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు పనితీరు, సోలార్, విద్యుత్ ప్రాజెక్టుల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆర్థిక అక్రమాలు, కారుణ్య నియామకాల జాప్యం, మెడికల్ బోర్డు నిర్వహణ, కార్మిక సంక్షేమం, భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలను బీజేపీ బృందం పరిశీలించనున్నట్లు తెలిపింది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుపుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీజేపీ ఆరోపించింది. పైగా ప్రస్తుతం కూడా సింగరేణిలో అవకతవకలు కొనసాగుతున్నాయని విమర్శించింది.సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వానికి రూ.51,500 కోట్లకు పైగా బకాయిలు ఉండటంతో సంస్థ ఆర్థికంగా ఒత్తిడిని ఎదుర్కొంటోందని బీజేపీ పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న సింగరేణి సంస్థను అక్రమాల నుంచి కాపాడాలనే లక్ష్యంతోనే ఈ క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నట్లు పార్టీ వెల్లడించింది.పర్యటన అనంతరం సేకరించిన వివరాల ఆధారంగా సమగ్ర నివేదిక రూపొందించి, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేలా తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

## గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 18:**

గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని మొక్క నాటి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, చెరువులు–నాలాల పరిరక్షణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని ప్రకటించారు.ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సీఎం చెప్పారు. 2018లో కొడంగల్‌లో ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తనపై నమ్మకం ఉంచి మల్కాజ్‌గిరి ఎంపీగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఎంపీగా ఎల్‌బీ నగర్ ప్రజలు ఇచ్చిన భారీ మెజార్టీ తన రాజకీయ జీవితంలో కీలకమైందన్నారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చామని చెప్పారు.రంగారెడ్డి జిల్లాలోని ఎల్‌బీ నగర్, బీఎన్ రెడ్డి, వనస్థలిపురం, గుర్రంగూడ వంటి ప్రాంతాలు గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, తమ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తోందన్నారు. రూ.2,400 కోట్లతో 240 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు.గుర్రంగూడ ఎకో పార్క్‌ను ప్రైవేట్ భూమిగా చూపించి లేఅవుట్లు చేసి విక్రయించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించిన సీఎం, ప్రభుత్వం





సుప్రీంకోర్టులో కేసు గెలిచి 424 ఎకరాలను ప్రజలకు నేషనల్ పార్క్‌గా అంకితం చేసిందన్నారు. ఈ ఎకో పార్క్ అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.హైడ్రాపై వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారి జోలికి హైడ్రా వెళ్లదని, పార్కులు, చెరువులు, నాలాలను ఆక్రమించిన వారిపైనే చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కొద్దిమంది కబ్జాదారుల వల్ల వేలాది మంది ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణదారులు ఎంత పెద్దవారైనా ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు.ఢిల్లీ కాలుష్యం, ముంబై వరదలు, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలను ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూసీ నది కాలుష్య నిర్మూలనతో పాటు చెరువులను ఆక్రమణల నుంచి విముక్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించిన సీఎం, 30 వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో 15 వేల ఎకరాలను అడవిగా అభివృద్ధి చేసి 60 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకొచ్చి, భవిష్యత్ తరాలు చర్చించుకునే నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ మధు యాష్కీతో పాటు అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎన్నికల అధికారితో సంప్రదింపులు జరిపి త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు.ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల సహకారంతో సేకరించిన రూ.1 కోటి ఆర్థిక సాయాన్ని అందజేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. కుటుంబంలోని అర్హులైన ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పించడంతో పాటు ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద బీమా పథకం కింద ఇప్పటికే 11 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున పరిహారం అందించినట్లు తెలిపారు.ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 30 నెలల కాలంలో ఆర్టీసీ బలోపేతానికి రూ.1,078 కోట్ల వ్యయంతో 2,815 కొత్త బస్సులను కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేశామని, మెడికల్ ఇన్వాలిడేషన్, బ్రెడ్ విన్నర్ పథకాల కింద 1,137 మందికి కారుణ్య నియామకాలు కల్పించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా బస్ డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూలు, పెద్దపల్లి బస్ డిపోల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వారం రోజుల్లో వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేయాలని, హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూలు, నాంపల్లి తదితర ప్రాంతాల బస్ స్టేషన్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మెదక్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, పరకాల, ములకనూరు, ధర్మపురి, మక్తల్ బస్ స్టేషన్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తున్నాయని మంత్రి తెలిపారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రం విరమించుకోవాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, వెలుతురు జూన్ 18**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి సీతక్క విమర్శించారు. సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.2005లో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిందని, అలాంటి చట్టానికి తూట్లు పొడిచే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. వంద రోజుల ఉపాధి హక్కును కల్పించే చట్టాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు, పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి దాని ఆత్మను, స్ఫూర్తిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.వీబీజీ–రాంజీ పేరుతో కేంద్రం తీసుకువస్తున్న కొత్త విధానం పేదల ఉపాధి అవకాశాలను దెబ్బ తీయడమే కాకుండా, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక, పరిపాలనా భారం మోపే ప్రమాదం ఉందన్నారు. ఈ నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీలో ఇప్పటికే తీర్మానం చేసినప్పటికీ, జూలై 1 నుంచి అమలు చేయాలని కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు.ఈ అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని సీతక్క తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, తాను సభ్యులుగా ఉన్న ఈ కమిటీ వివిధ రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, చర్చలు జరిపి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటుందన్నారు.రాష్ట్రాలపై అదనపు భారం మోపకుండా, కూలీల హక్కులకు భంగం కలగకుండా ఏ మార్పులు తీసుకురావాలన్న దానిపై కేంద్రం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య తగ్గేలా పలు సాంకేతిక అవరోధాలు సృష్టిస్తున్నారని, రోజుకు రెండు సార్లు ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోలు క్యాప్చర్ చేయాలనే నిబంధన వల్ల జిల్లాల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని, ప్రతి రోజు సమీక్షలు నిర్వహిస్తూ గ్రామీణ కూలీలకు మరింత ఉపాధి కల్పించే చర్యలు చేపడుతోందన్నారు. గత ఏడాది మొత్తం 7.5 కోట్ల పనిదినాలు కల్పించగా, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు అదే స్థాయిలో 7.5 కోట్ల పనిదినాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కేంద్రం వెంటనే విరమించుకోవాలని సీతక్క డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాస్తామని, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం వీబీజీ–రాంజీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# పెట్రో ధరలపై కేంద్రం కీలక ప్రకటన

- ఇంధన ధరల పెంపుతో రూ.3.94 మాత్రమే భారం
- యుద్ధం వల్ల కేంద్రానికి రూ. 12,000 కోట్ల భారీ నష్టం
- రాష్ట్ర ప్రభుత్వాల కంటే కేంద్రంపై భారం
- అమెరికా - ఇరాన్ ఒప్పందంతో పడిపోయిన చమురు ధరలు

**ఢిల్లీ వెలుతురు జూన్ 18:**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు (క్రూడాయిల్) ధరలు తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్ – అమెరికా మధ్య కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు పతనమైన సంగతి తెలిసిందే. అయితే, ఈ తగ్గింపు ప్రయోజనాలు భారతీయ వినియోగదారులకు వెంటనే బదిలీ చేయడం కుదరదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి తేల్చిచెప్పారు. రవాణా మార్గాల్లో ఉన్న ఇబ్బందులు, గత కొన్ని నెలలుగా చమురు సంస్థలు భరించిన నష్టాల దృష్ట్యా ఇంధన ధరల తగ్గింపునకు మరికొంత సమయం పడుతుందని ఆయన వివరించారు. ఈ మేరకు చమురు సరఫరా వ్యవస్థ పునరుద్ధరణ, పశ్చిమాసియా సంక్షోభం, కేరళలో ఎయిమ్స్ ఏర్పాటు వంటి పలు కీలక అంశాలపై మంత్రి సురేశ్ గోపి మీడియాతో మాట్లాడారు. అమెరికా–ఇరాన్ దేశాల మధ్య కుదిరిన సరికొత్త ఒప్పందం వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా తగ్గుముఖం పట్టిన మాట వాస్తవమేనని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అంగీకరించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గిన మరుక్షణమే ఇక్కడ పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించడం వీలుపడదని ఆయన స్పష్టం చేశారు. చమురు మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకునేందుకు, గతంలో పెంచిన ధరలను స్థిరీకరించేందుకు దేశీయ చమురు కంపెనీలకు కొంత సమయం పడుతుందన్నారు. ప్రపంచ మార్కెట్లలో రేట్లు పడిపోయిన వెంటనే పాత ధరలను వెనక్కి తీసుకోవడం అంత సులువు కాదని, దీని వెనుక అనేక సాంకేతిక, ఆర్థిక కారణాలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు.అంతర్జాతీయంగా చౌక ధరలకే ముడిచమురు లభిస్తున్నప్పటికీ, అది భారతదేశానికి సురక్షితంగా చేరడానికి రవాణా పరమైన అడ్డంకులు ఉన్నాయని మంత్రి వివరించారు. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' ప్రస్తుతం తెరుచుకున్నప్పటికీ, అక్కడ నౌకల రాకపోకల రద్దీ (ట్రాఫిక్) విపరీతంగా పెరిగిపోయిందని చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ముగింపు తర్వాత ఇప్పుడిప్పుడే నౌకలు కదులుతున్నాయని, ఆ రూట్‌లో పరిస్థితి సాధారణ స్థితికి రావడానికి చాలా రోజులు పడుతుందన్నారు. అందువల్ల, తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత తీరాలకు చేరడానికి మరింత సమయం పడుతుందని, అంతవరకు ధరల తగ్గింపుపై నిర్ణయం తీసుకోలేమని మంత్రి తేల్చిచెప్పారు.ఇటీవలి కాలంలో ప్రపంచ పరిస్థితుల కారణంగా ఇంధన ధరలు భారీగా పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల సామాన్య ప్రజలపై పెద్దగా భారం పడలేదని సురేశ్ గోపి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ధరలు ఆకాశాన్నంటిన సమయంలో కూడా దేశీయ వినియోగదారులపై కేవలం లీటరుకు సుమారు రూ. 3.94 మేర మాత్రమే భారం పడేలా చమురు సంస్థలు మేనేజ్ చేశాయని గుర్తు చేశారు. అంతకు మించి పెరిగిన అదనపు భారాన్ని సామాన్యులపై వేయకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలే భరించాయని, కాబట్టి ఇప్పుడు అంతర్జాతీయ ధరలు తగ్గినప్పుడు ఆ నష్టాలను సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి మాసం నుండి పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో కొనసాగిన సుదీర్ఘ యుద్ధ పరిస్థితులు, ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా వ్యవస్థను దెబ్బతీశాయని కేంద్ర మంత్రి



ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కారణంగా చమురు రవాణా వ్యయం, బీమా ప్రీమియంలు విపరీతంగా పెరిగిపోయి దేశీయ చమురు రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయన్నారు. అయితే, పెరిగిన ఈ భారీ భారాన్ని దేశ ప్రజలపై మోపకుండా కేంద్ర ప్రభుత్వమే స్వయంగా భరించిందని మంత్రి వెల్లడించారు. ఈ సంక్షోభ నిర్వహణ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 12,000 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు.దేశంలో ఇంధన ధరలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరును మంత్రి సురేశ్ గోపి తప్పుబట్టారు. చమురు ధరల సంక్షోభం ఏర్పడినప్పుడు రాష్ట్రాలు తమకు వచ్చే పన్నుల ఆదాయాన్ని వదులుకోవడానికి సిద్ధపడలేదని, పెట్రోల్, డీజిల్‌పై స్టేట్ వ్యాట్ పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించలేదని విమర్శించారు. అలాంటి కష్టకాలంలో కూడా కేంద్ర ప్రభుత్వమే చమురు సంస్థలతో కలిసి దేశ ఆర్థిక వ్యవస్థను, ఇంధన సరఫరా వ్యవస్థను కుప్పకూలకుండా నిలబెట్టిందని, బాధ్యతాయుతంగా వ్యవహరించి వ్యవస్థను సజావుగా కొనసాగించిందని మంత్రి స్పష్టం చేశారు.గత ఫిబ్రవరి నెల నుండి పశ్చిమాసియాలో సాగుతున్న ఉద్రిక్తతలకు ఎట్టకేలకు తెరపడిందని మంత్రి సురేశ్ గోపి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఇరాన్ మరియు అమెరికా దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందం ప్రపంచ దేశాలకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. ఇరు దేశాల అధ్యక్షులు ఈ అవగాహన ఒప్పందంపై డిజిటల్ సంతకాలు కూడా పూర్తి చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పడిపోయాయని తెలిపారు. గత మూడు నెలలుగా యుద్ధం వల్ల సరఫరా గొలుసు (సప్లై చైన్) పూర్తిగా దెబ్బతిన్నదని, ఈ ఒప్పందంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం సమసిపోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అంతర్జాతీయంగా శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ, మార్కెట్లో ధరలు పూర్తిగా స్థిరపడటానికి మరికొంత సమయం పడుతుందని ఆర్థిక, రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. యుద్ధం సృష్టించిన అంతరాయాలు పూర్తిగా తొలగిపోవాల్సి ఉందన్నారు. అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు, గ్లోబల్ ఇన్సూరెన్స్ (బీమా) కంపెనీలు సముద్ర మార్గాల్లో చమురు మరియు సహజవాయువు రవాణా పూర్తిగా సురక్షితం అని మరియు సాధారణ స్థితికి చేరిందని నమ్మిన తర్వాతే రవాణా ఛార్జీలు తగ్గుతాయని, అప్పుడే ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలలో శాశ్వత స్థిరత్వం ఏర్పడుతుందని మంత్రి వివరించారు.ఇదే సమయంలో కేరళ రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఏర్పాటు అంశంపై మంత్రి సురేశ్ గోపి మాట్లాడారు. ఎయిమ్స్ వంటి పెద్ద సంస్థల ఏర్పాటు అనేది మార్కెట్లో వస్తువులు కొనేంత సులభమైన ప్రక్రియ కాదని, దీనికి కొన్ని నిర్దిష్ట కేంద్ర నిబంధనలు, పద్ధతులు ఉంటాయన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రి కే మురళీధరన్ గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యల్లో స్పష్టత కొరవడిందని అభిప్రాయపడ్డారు. కేరళ ప్రభుత్వం ఎయిమ్స్ కోసం సేకరించిన భూముల వివరాలను ముందుగా ప్రత్యేక కమిటీకి సమర్పించాలని, వారు పరిశీలించాకే తుది నిర్ణయం ఉంటుందన్నారు. ఈ విషయంపై చర్చించేందుకు తనను సంప్రదిస్తానని ఆరోగ్య మంత్రి చెప్పినప్పటికీ, ఇప్పటివరకు తనకు ఎలాంటి అధికారిక పిలుపు లేదా ఆహ్వానం అందలేదని సురేశ్ గోపి వెల్లడించారు.

VELTHURU TELUGU DAILY


# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 19.06.2026

సంపుటి : 08 సంచిక : 10 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH www.velthuru.com






## గుర్రంగూడ ఎకో పార్క్‌లో

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం

# వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి

- మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీని ఎవరూ అడ్డుకోలేరు: సీఎం రేవంత్ రెడ్డి
- మొక్క నాటి వనమహోత్సవం ప్రారంభం
- ఎకో పార్క్ ఫోటో ప్రదర్శన వీక్షణ
- మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరు
- పచ్చదనం పెంపుపై ప్రభుత్వ దృష్టి
- హైడ్రాపై సీఎం వివరణ
- మూసీ ప్రక్షాళనకు కట్టుబాటు
- ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఖాయం





2

## పెట్రో ధరలపై కేంద్రం కీలక ప్రకటన



- ముడిచమురు దిగొచ్చినా తగ్గింపు సాధ్యం కాదు..
- వివరణ ఇచ్చిన మంత్రి సురేశ్ గోపి
- దేశీయంగా ఇప్పుడే ఊరట లేదని వెల్లడి
- హర్మూజ్ జలసంధిలో నౌకల రద్దీ..
- భారత్‌కు చమురు రావడానికి మరింత సమయం

2

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రం విరమించుకోవాలి: మంత్రి సీతక్క



2

## మధిర సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం



- మధిర సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ధాన్యం కొనుగోలుపై కేంద్రానికి తెలంగాణ డిమాండ్
- ఎరువుల కోటా పెంపు, మెట్రో విస్తరణకు సహకారం కోరిన రాష్ట్రం
- డిజిటల్ కేబినెట్‌కు మంత్రివర్గం ఆమోదం
- నీట్ విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

విబి-జీ ఆర్‌ఏఎం జీపై కేబినెట్ సబ్ కమిటీ

▶ మిగతా 4లో

## మాస్కోపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

- వందలాది డ్రోన్లతో మాస్కోపై ఉక్రెయిన్ దాడి
- మూతపడ్డ ప్రధాన విమానాశ్రయాలు ఉక్రెయిన్ దాడి
- కపోట్న్యా చమురు శుద్ధి కేంద్రం లక్ష్యం
- రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం
- నగరాన్ని కమ్మేసిన దట్టమైన పొగ
- వారం రోజుల్లో రెండోసారి లక్ష్యంగా రిఫైనరీ
- మూతపడిన మాస్కో అంతర్జాతీయ విమానాశ్రయాలు
- విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వందలాది విమానాల రద్దు, ఆలస్యం
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- మరింత ఉధృతమైన రష్యా-ఉక్రెయిన్



యుద్ధం

**రష్యా-ఉక్రెయిన్ వెలుతురు జూన్ 18:**

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉధృతమవుతోంది. ఉక్రెయిన్ గురువారం రష్యా రాజధాని మాస్కోపై వందలాది డ్రోన్లతో భారీ దాడికి పాల్పడింది. ఈ దాడిలో మాస్కోలోని కీలక ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కపోట్న్యా ఆయిల్ రిఫైనరీపై భారీ స్థాయిలో డ్రోన్ దాడి జరగడంతో అక్కడ భారీ అగ్నిప్రమాదం సంభవించింది.డ్రోన్ దాడి అనంతరం రిఫైనరీలో భారీ మంటలు చెలరేగగా, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు.

▶ మిగతా 2లో

## ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

- జూలై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్
- ఆర్పీఎస్-2021 ప్రకారం ఫిట్‌మెంట్ అమలు ప్రకటించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- త్వరలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు
- శంకర్ కుటుంబానికి రూ.1 కోటి సాయం, ఉద్యోగం, ఇల్లు కల్పించనున్నట్లు వెల్లడి
- 30 నెలల్లో 2,815 కొత్త బస్సుల కొనుగోలు.. మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్ష

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆర్పీఎస్–2021 ప్రకారం 11 శాతం ఫిట్‌మెంట్‌ను ఈ ఏడాది జూలై 1 నుంచి



అమలు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. సచివాలయంలో ఆర్టీసీ ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు.ఆర్టీసీ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగానే ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులకు జీతాలు పెరగనున్నాయని చెప్పారు.

▶ మిగతా 2లో

## సింగరేణిలో అక్రమాలపై బీజేపీ ఫ్యాక్ట్ ఫైండింగ్..

- నేడు మంచిర్యాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన



2



4

## ఖమ్మం బాలికకు అండగా ప్రభుత్వం

## ఉద్ధవ్ ఠాక్రేకు ఊహించని షాక్

- శివసేన (యుబిటి) లోక్‌సభ పక్షం చీలిక..
- షిండే వర్గంలో చేరతామంటూ ఆరుగురు ఎంపీల లేఖ
- విప్ జారీ చేసినా రాని ఆరుగురు రెబెల్ ఎంపీలు
- లోక్‌సభ స్పీకర్‌కు విలీన లేఖ సమర్పణ
- తిరుగుబాటుదారులపై సంజయ్ రౌత్ తీవ్ర ఆగ్రహం



4

# గొలుసులు తెగినప్పుడు...

చరిత్రను చాలామంది రాజుల కథగా చదువుతారు. కొందరు యుద్ధాల కథగా గుర్తుంచుకుంటారు. కానీ చరిత్ర అసలు రూపంలో చూస్తే అది అధికారానికి, ప్రతిఘటనకు, అణచివేతకు, స్వేచ్ఛకు మధ్య జరిగిన నిరంతర సంఘర్షణ. ఒక వర్గం తన ఆధిపత్యాన్ని శాశ్వతం చేయాలని ప్రయత్నించిన ప్రతిసారీ, మరో వర్గం తన గౌరవాన్ని తిరిగి పొందేందుకు పోరాడింది. నాగరికత ముందుకు సాగిన ప్రతి అడుగులో ఈ రెండు శక్తుల మధ్య జరిగిన ఘర్షణల ప్రతిధ్వనులు వినిపిస్తూనే ఉంటాయి.ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యాలు పుట్టాయి, కూలిపోయాయి. సరిహద్దులు మారాయి. పాలకులు మారిపోయారు. కానీ ఒక ప్రశ్న మాత్రం శతాబ్దాలుగా అలాగే నిలిచి ఉంది — ఒక మనిషికి మరో మనిషిపై యాజమాన్య హక్కు ఉంటుందా? శక్తి, సంపద, జాతి, వర్ణం, మతం లేదా జన్మ ఆధారంగా కొందరు ఇతరుల జీవితాలను నియంత్రించగలరా?ఈ ప్రశ్నకు సమాధానం వెతికిన ప్రయాణమే మానవ హక్కుల చరిత్ర.ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెద్ద భాగం బానిస శ్రమపై ఆధారపడేది. పొలాల్లో పండిన పత్తి నుంచి సముద్రాలను దాటిన వాణిజ్యం వరకు అనేక రంగాల్లో బానిసల శ్రమ కనిపించేది. అయితే ఆ శ్రమ వెనుక కనిపించనిది ఒక విషాద ప్రపంచం. కుటుంబాల నుంచి బలవంతంగా వేరు చేయబడిన జీవితాలు, పేర్లు కోల్పోయిన వ్యక్తిత్వాలు, హక్కులు లేని మనుషులు, ఆశలు నిషేధించబడిన తరాలు.చరిత్రలో అత్యంత క్రూరమైన వ్యవస్థలు ఎప్పుడూ తమను తాము సహజమైనవిగా చూపించుకునే ప్రయత్నం చేశాయి. బానిసత్వం కూడా అలాంటిదే. దాన్ని ఆర్థిక అవసరంగా, సామాజిక క్రమంగా, రాజకీయ ప్రయోజనంగా సమర్థించేందుకు ఎన్నో సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. కానీ ఒక మనిషి స్వేచ్ఛను మరొకరి లాభం కోసం హరించే వ్యవస్థ ఎంతకాలం నిలిచినా, అది న్యాయబద్ధం కాలేదు.

కాలక్రమేణా ప్రతిఘటన పెరిగింది. రచయితలు కలం పట్టారు. మేధావులు ప్రశ్నించారు. మతపెద్దలు నిరసించారు. అణచివేతకు గురైనవారు తిరుగుబాటు చేశారు. చివరకు రాజకీయ వ్యవస్థలే మార్పును అంగీకరించాల్సి వచ్చింది.అలాంటి మార్పుల చరిత్రలో ఒక సంకేతాత్మక ఘట్టం 1865 జూన్ 19. అమెరికాలో బానిసత్వ నిర్మూలన చట్టపరంగా ప్రకటించబడిన తర్వాత కూడా దాని ప్రభావం అందరికీ చేరలేదు. టెక్సాస్‌లోని గాల్వెస్టన్ ప్రాంతంలో వేలాది మంది బానిసలకు తమ స్వేచ్ఛ గురించి అధికారికంగా తెలియజేయబడిన రోజు జూన్ 19. ఆ సంఘటన తరువాత కాలంలో కేవలం అమెరికా చరిత్రలోనే కాదు, మానవ స్వేచ్ఛ గురించి ప్రపంచవ్యాప్తంగా జరిగిన చర్చల్లో కూడా ఒక ప్రతీకగా నిలిచింది. చట్టం ఒక పత్రంపై రాసిన మాటగా ఉండకుండా, మనిషి జీవితంలో వాస్తవంగా మారిన క్షణం అది.అయితే చరిత్రలో స్వేచ్ఛ ఎప్పుడూ ఒకే రోజులో పూర్తిగా సాధించబడలేదు. గొలుసులు తెగిపోవచ్చు; కానీ మనస్తత్వాల గోడలు అలాగే మిగిలిపోవచ్చు. చట్టాలు మారవచ్చు; కానీ సామాజిక వివక్ష కొనసాగవచ్చు. అందుకే మానవ హక్కుల పోరాటం ఒక సంఘటనతో ముగిసిపోదు. అది నిరంతర ప్రక్రియ.భారతదేశ చరిత్ర కూడా ఇదే విషయాన్ని చెబుతుంది. వలస పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించడం ఒక ఘట్టం. కానీ సామాజిక సమానత్వం కోసం జరిగిన పోరాటాలు మరో ఘట్టం. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినప్పటికీ, ఆ హక్కులు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరే ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది.నేడు ప్రపంచం సాంకేతికంగా ఎన్నడూ లేనంత అభివృద్ధి సాధించింది. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచీకరణ — ఇవన్నీ కొత్త యుగానికి సూచికలు. కానీ మరోవైపు యుద్ధాలు, జాతి వివక్ష, ఆర్థిక అసమానతలు, వలస సంక్షోభాలు, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలు ఇంకా మానవత్వాన్ని సవాలు చేస్తున్నాయి.అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు. ఒక సమాజంలో అత్యంత బలహీనుడైన వ్యక్తి ఎంత గౌరవంతో జీవిస్తున్నాడో అదే నిజమైన అభివృద్ధి ప్రమాణం. భారీ భవనాలు, వేగవంతమైన రవాణా వ్యవస్థలు, సాంకేతిక అద్భుతాలు నాగరికతకు గుర్తులు కావచ్చు; కానీ మనిషి విలువను గుర్తించే సామర్థ్యమే నాగరికతకు అసలు నిర్వచనం.చరిత్రను వెనక్కి తిరిగి చూసినప్పుడు మనకు కనిపించేది కేవలం గతం కాదు. వర్తమానానికి అద్దం కూడా. బానిసత్వం, వలస పాలన, వివక్ష, అణచివేత వంటి అధ్యాయాలు మానవ సమాజం చేసిన తప్పులను గుర్తు చేస్తాయి. అదే సమయంలో వాటికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తులు, ఉద్యమాలు, ఆలోచనలు మనిషిలోని ఉత్తమ లక్షణాలను గుర్తు చేస్తాయి.స్వేచ్ఛ అనేది ప్రభుత్వాలు ప్రసాదించే వరం కాదు. అది మానవ గౌరవం నుంచి పుట్టే హక్కు. సమానత్వం అనేది చట్ట పుస్తకాలలో ఉండే పదం కాదు. అది ప్రతి మనిషి జీవితంలో అనుభూతి కావాల్సిన వాస్తవం. చరిత్రలో గొలుసులు తెగిన ప్రతి సందర్భం ఈ సత్యాన్నే మరోసారి ప్రపంచానికి గుర్తు చేసింది.



చిటికెన కిరణ్ కుమార్
ప్రముఖ సాహితీవేత్త విమర్శకులు
సెల్: 9490841284

# మధిర సభలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం

- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్న కమిటీ
- ప్రాజెక్టుల అనుమతులకు సహకరించాలని బీజేపీ ఎంపీలకు విజ్ఞప్తి
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించినట్లు భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జూన్ 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే రైతు సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి వివరించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఏడు రకాల సన్న వరిధాన్యాలకు బోనస్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్లో ఈ రకాల ధాన్యానికి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించడం లేదని కేబినెట్ సమావేశంలో ఆందోళన వ్యక్తమైనట్లు తెలిపారు. కనీస మద్దతు ధర కింద కొనుగోలు చేసే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.వ్యవసాయానికి అవసరమైన ఎరువుల కోటాను వెంటనే కేటాయించాలని కూడా కేంద్రాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు. ఈ అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర అవసరాలను వివరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

రామగుండంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణకు కేటాయించాలని కూడా కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు.హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు కేంద్రం వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాలను విడుదల చేయాలని కూడా కేంద్రాన్ని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు త్వరగా లభించేలా బీజేపీ ఎంపీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని పెంచే దిశగా ఇకపై డిజిటల్ కేబినెట్ నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.విబి-జీ ఆర్ఏఎం జీ (VB-G RAM G) అంశంపై అధ్యయనం చేసేందుకు మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించిన అనంతరం జూన్ 25లోపు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న మహిళా సంఘాలు

- సెర్ప్ ఆధ్వర్యంలో యూనిఫాంల తయారీలో 20 వేల మందికి పైగా మహిళలు
- ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంల కుట్టి పాఠశాలలకు సరఫరా
- నేడే సీఎం చేతుల మీదుగా పంపిణీ కానున్న 5 వేల స్టూడెంట్ కిట్లను సిద్ధం చేసిన మహిళలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరంలో యూనిఫాంలు సకాలంలో అందేలా సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మహిళల నైపుణ్యాలను ఉపాధిగా మార్చి, వారి కుటుంబాలకు ఆదాయ వనరులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందించే ఉమ్మడి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.2026-27 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికి పైగా మహిళా సంఘాల టైలర్లు యూనిఫాంల కుట్టు పనుల్లో పాల్గొంటున్నారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ప్రత్యేక శిక్షణ అందించి, ఆధునిక ప్రమాణాలతో యూనిఫాంల తయారీ చేపట్టారు. విద్యార్థుల కొలతలను





సేకరించి, వాటి ఆధారంగా యూనిఫాంలను కుట్టడం ద్వారా ప్రతి విద్యార్థికి సరైన కొలతలో దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా 'మేకర్ అండ్ చెకర్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా సభ్యులను నాణ్యత పరిశీలకులుగా నియమించి, కుట్టిన ప్రతి యూనిఫాంను తనిఖీ చేస్తున్నారు. అలాగే అవసరమైన మార్పులు, చేర్పులు వెంటనే చేయడానికి గ్రామ స్థాయిలోనే టైలర్లను అందుబాటులో ఉంచుతున్నారు.ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులు ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంలను కుట్టి సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు సరఫరా చేస్తున్నారు. విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.అదేవిధంగా శుక్రవారం నాడు ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం కోసం 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అందించే 5 వేల స్టూడెంట్ కిట్లను కూడా సెర్ప్ మహిళలు విజయవంతంగా సిద్ధం చేశారు. ఈ కిట్లలో భాగంగా యూనిఫాంల తయారీ, ప్యాకింగ్, పంపిణీ ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "మహిళా స్వయం సహాయక బృందాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా ఎదుగుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు చూపుతున్న అంకితభావం అభినందనీయం. సెర్ప్ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోంది. ఒకవైపు మహిళలకు ఆదాయం, మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా చేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమైనది" అని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల తయారీలో భాగస్వాములైన ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి మంత్రి సీతక్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

# ఖమ్మం బాలికకు అండగా ప్రభుత్వం

- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించిన మంత్రి సీతక్క
- కుటుంబానికి 5 లక్షల చెక్ అందచేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, వెలుతురు జూన్ 18:**

ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు గురువారం వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆసుపత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జస్టిస్ పంచాక్షరి కూడా మంత్రితో కలిసి బాలికను పరామర్శించారు.బాలికకు అందుతున్న వైద్య సేవలు, శస్త్ర చికిత్స అనంతర పరిస్థితి గురించి నిమ్స్ వైద్యులు మంత్రి సీతక్కకు వివరించారు. బాలిక కోలుకునే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నామని వైద్య బృందం తెలిపింది.ఈ సందర్భంగా బాధిత బాలిక తల్లిదండ్రులను కలిసిన మంత్రి సీతక్క వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. బాలిక పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య చికిత్సను ప్రభుత్వం తరపున అందిస్తామని స్పష్టం చేశారు.అలాగే బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి అందజేశారు. బాలిక భవిష్యత్తు, విద్య, పునరావాసం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. బాలిక తోబుట్టువులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తామన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం రాజీ పడదని అన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయపరమైన, వైద్యపరమైన, ఆర్థికపరమైన సహాయాన్ని సమగ్రంగా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝా, ఆర్.జే.డీ మోతి, నిమ్స్ వైద్యులు, శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఉద్ధవ్ ఠాక్రేకు ఊహించని షాక్

- రెబెల్స్ సభ్యత్వాల రద్దుకు వ్యూహాలు

**మహారాష్ట్ర వెలుతురు జూన్ 18:**

మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను భూకంపం సృష్టించే పరిణామం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్న ప్రచార నిజం చేస్తూ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) వర్గానికి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు తిరుగుబాటు బావుటా ఎగరేశారు. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అత్యంత కీలకమైన పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని సదరు ఎంపీలు బహిష్కరించారు. పార్టీ అధిష్ఠానం అధికారికంగా విప్ జారీ చేసినప్పటికీ, వీరంతా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. తామంతా ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని అసలైన శివసేన పార్టీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించడం ఢిల్లీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామంతో ఉద్ధవ్ ఠాక్రేకు లోక్‌సభలో కోలుకోలేని దెబ్బ తగిలినట్లయింది.ఢిల్లీలోని శివసేన (యుబిటి) పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు అత్యవసర సమావేశం ఏర్పాటయింది. లోక్‌సభలో ఈ పార్టీకి మొత్తం 9 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, సమావేశానికి కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. లోక్‌సభ నేత అరవింద్ సావంత్, చీఫ్ విప్ అనిల్ దేశాయ్, రాజాభావూ వాజేలతో పాటు పార్టీ ఏకైక రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ మాత్రమే ఇందులో పాల్గొన్నారు. పార్టీ జారీ చేసిన విప్‌ను పూర్తిగా తోసిరాజని నగేష్ ఆష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినపాటిల్, ఓంప్రకాష్ రాజేనింబాల్కర్, భావూసాహెబ్ వాక్‌చౌరే అనే ఆరుగురు ఎంపీలు ఈ సమావేశానికి రాకుండా దూరంగా ఉండిపోయారు.సమావేశానికి దూరంగా ఉన్న ఆరుగురు రెబెల్ ఎంపీలు.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీలో తమను విలీనం చేయాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక సంయుక్త లేఖను సమర్పించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తమ రాజకీయ నిర్ణయాన్ని స్పీకర్ కార్యాలయానికి అధికారికంగా తెలియజేస్తూ.. లోక్‌సభ సభామందిరంలో తమకు ఉద్ధవ్ వర్గం నుంచి వేరుగా ప్రత్యేక ఆసనాలు (సీట్లు) కేటాయించాలని కూడా సదరు లేఖలో కోరినట్లు సమాచారం. ఈ తిరుగుబాటుతో లోక్‌సభలో శివసేన (యుబిటి) పక్షం అధికారికంగా రెండుగా చీలిపోయినట్లయింది.తిరుగుబాటు ఎంపీలు సమర్పించిన లేఖపై లోక్‌సభ స్పీకర్ కార్యాలయం ప్రస్తుతం ప్రాథమిక విచారణ జరుపుతోంది. లేఖలో ఉన్న ఎంపీల సంతకాల ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విలీన ప్రక్రియ చట్టబద్ధంగా పూర్తిగా ముగియడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుందని పార్లమెంట్ వర్గాలు పేర్కొన్నాయి. సంతకాల ధ్రువీకరణ కోసం రెబెల్ ఎంపీలలో కొందరు స్వయంగా స్పీకర్ ముందు హాజరు కావాల్సి ఉంటుందని, రాబోయే ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కూడా పూర్తి కానుందని లోక్‌సభ సచివాలయ వర్గాలు స్పష్టం చేశాయి.

శివసేన (యుబిటి) ఎంపీల తిరుగుబాటుపై ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటరీ సమావేశం ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. సమావేశానికి రాకుండా మొహం చాటేసిన ఎంపీలను 'ద్రోహులు'గా అభివర్ణించారు. పార్టీ క్రమశిక్షణను, అధికారిక విప్‌ను ఉల్లంఘించినందుకు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సొంత లాభాల కోసం పార్టీని, తమను నమ్మిన ఓటర్లను మోసం చేసిన ఇలాంటి వారిని చరిత్ర క్షమించదని, వారి రాజకీయ భవిష్యత్తు ముగిసిపోయిందని రౌత్ మండిపడ్డారు.పార్టీ ఆదేశాలను బూట్ల కింద తొక్కిన ఆరుగురు ఎంపీల లోక్‌సభ సభ్యత్వాలను రద్దు చేసే దిశగా శివసేన (యుబిటి) చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. నిబంధనల ప్రకారం వారికి తక్షణమే 'షో-కాజ్' ) నోటీసులు జారీ చేయనున్నట్లు సంజయ్ రౌత్ వెల్లడించారు. "మా నేతలు అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్ సమక్షంలో జరిగిన సమావేశానికి రాకపోవడం ముమ్మాటికీ పార్టీ ఫిరాయింపు కిందికే వస్తుంది. వారు బుధవారమే దొంగచాటుగా స్పీకర్‌ను కలిసి విలీనం గురించి మాట్లాడారు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుని, పార్లమెంట్ నుండి అనర్హులను చేసేందుకు అడుగులు వేస్తున్నాం" అని రౌత్ స్పష్టం చేశారు.ఈ వివాదంపై ఆ పార్టీ లోక్‌సభ పక్ష నేత అరవింద్ సావంత్ కూడా ఘాటుగా స్పందించారు. విప్ జారీ చేసినప్పటికీ ఎంపీలు ఎందుకు హాజరుకాలేదో లిఖితపూర్వకంగా అడుగుతామన్నారు. నోటీసులు అందిన తర్వాత సమాధానం ఇవ్వడానికి సదరు ఎంపీలకు ఏడు రోజుల సమయం ఇస్తామని చెప్పారు. ఒకవేళ ఆ గడువులోగా వారి నుండి సరైన వివరణ రాకపోతే లేదా వారు స్పందించడానికి నిరాకరిస్తే.. వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అధికారికంగా ఫిర్యాదు లేఖ సమర్పిస్తామని శివసేన లోక్‌సభ ఫ్లోర్ లీడర్ అరవింద్ సావంత్ వివరించారు.మరోవైపు, ఉద్ధవ్ ఠాక్రే వర్గం జారీ చేసిన ఈ విప్ చెల్లుబాటును ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే వర్గం తీవ్రంగా సవాలు చేసింది. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం.. ఒక పార్టీ జారీ చేసే విప్ అనేది కేవలం సభ లోపల జరిగే ఓటింగ్‌లు, పార్లమెంట్ అధికారిక కార్యకలాపాల కోసమే వర్తిస్తుందని వారు వాదించారు. పార్టీ అంతర్గతంగా పెట్టుకునే ప్రైవేటు సమావేశాలకు హాజరు కాలేదనే నెపంతో విప్ ఉల్లంఘన కింద సభ్యులపై చర్యలు తీసుకోవడం చట్టరీత్యా చెల్లదని, కాబట్టి ఉద్ధవ్ వర్గం ఇచ్చే నోటీసులకు ఎలాంటి విలువ ఉండదని షిందే వర్గ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.పార్లమెంటు నిబంధనల ప్రకారం.. లోక్‌సభలో ఒక పార్టీకి ఉన్న మొత్తం సభ్యులలో కనీసం మూడింట రెండు వంతుల మంది ఎంపీలు విడిపోయి వేరే పార్టీలో విలీనమైతేనే వారిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉంటుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉద్ధవ్ వర్గానికి 9 మంది ఎంపీలు ఉండగా, చట్ట ప్రకారం అనర్హత నుండి తప్పించుకోవడానికి కనీసం ఆరుగురు ఎంపీల మద్దతు అవసరం. సరిగ్గా ఆరుగురు ఎంపీలే ఇప్పుడు ఏకతాటిపైకి వచ్చి షిందే వర్గంలో విలీన లేఖ ఇవ్వడం గమనార్హం. ఈ వ్యూహం వెనుక సీఎం ఏక్‌నాథ్ షిందే ఢిల్లీ పర్యటన ఉందని, ఆయనే స్వయంగా ఢిల్లీ వచ్చి అంతా చక్కబెట్టి ముంబయి వెళ్లారని రాజకీయ వర్గాల్లో గట్టిగా ప్రచారం సాగుతోంది.

# బోయిగూడ యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డా. పుట్ల శ్రీనివాస్

- సిబ్బంది సమయపాలన, రికార్డుల నిర్వహణపై ఆదేశాలు
- పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచన

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DM&HO) డా. పుట్ల శ్రీనివాస్ గురువారం సీతఫల్ మండి క్లస్టర్ పరిధిలోని బోయిగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (UPHC)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, వివిధ రికార్డుల నిర్వహణతో పాటు పరిశుభ్రత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం వైద్య సిబ్బందికి సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని ఆదేశించారు. అలాగే యూపీహెచ్‌సీ పరిధిలోని పేద ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఆరోగ్య సేవలు, వైద్య పరీక్షలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రమాదేవి పబ్లిక్ స్కూల్ విద్యార్థుల పథకాల మోత

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 18:**

CISCE యోగా పోటీలు 2026–27 జోనల్ స్థాయి పోటీలలో రమాదేవి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని నీరజ్ పబ్లిక్ స్కూల్, అమీర్‌పేట్‌లో నిర్వహించబడ్డాయి.

**స్వర్ణ పతక విజేతలు:**

- పోలగోని గౌతమ్ గౌడ్ – ఆర్టిస్టిక్ పెయిర్ (అండర్-17)
- సాయి హర్షిత్ – ఆర్టిస్టిక్ పెయిర్ (అండర్-17)
- పోలగోని గౌతమ్ గౌడ్ – ట్రెడిషనల్ యోగాసన సింగిల్ (అండర్-17)
- సాయి హర్షిత్ – ఆర్టిస్టిక్ ఇండివిడ్యువల్ (అండర్-17)
- పోలగోని సాహిత్ గౌడ్ – ఆర్టిస్టిక్ సింగిల్ (అండర్-19)

- **రజత పతక విజేతలు:**
- భార్గవ్ – రిథమిక్ పెయిర్ (అండర్-14)
- శ్రీ హర్షిత్ – రిథమిక్ పెయిర్ (అండర్-14)

- **కాంస్య పతక విజేతలు:**
- లౌక్య – ఆర్టిస్టిక్ పెయిర్ (అండర్-14)
- అస్మిత – ఆర్టిస్టిక్ పెయిర్ (అండర్-14)
- లౌక్య – రిథమిక్ పెయిర్ (అండర్-14)
- పుణ్యహ – రిథమిక్ పెయిర్ (అండర్-14)
- మల్లెపల్లి చైతన్య – ట్రెడిషనల్ యోగాసన సింగిల్ (అండర్-14)

ఈ పోటీలలో రమాదేవి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మొత్తం 5 స్వర్ణ పతకాలు, 2 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా




పాఠశాల ప్రిన్సిపాల్ కమర్ సుల్తానా, ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల యాజమాన్యం విజేత విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు అంకితభావంతో శిక్షణ అందించిన యోగ గురువు శ్రీ నరేష్ గారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ విజయం వారి కృషి, పట్టుదల మరియు సమర్థవంతమైన శిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలలో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ముత్యాలబాగ్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- స్థానికుల సమస్యను జలమండలి దృష్టికి తీసుకెళ్లిన మహాలక్ష్మి రామన్ గౌడ్
- జలమండలి మేనేజర్‌తో సమావేశమైన కాలనీవాసులు
- గ్రౌండ్ లెవెల్ వాటర్ తగ్గడంతోనే సమస్యలు: అధికారులు
- త్వరలోనే తాగునీటి సరఫరా మెరుగుపరుస్తామని హామీ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**



హైదరాబాద్ జిల్లా హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ముత్యాలబాగ్ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానికులు హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె స్థానిక ప్రజలతో కలిసి జలమండలి అధికారులను కలిసి వెంటనే పరిష్కారం చూపాలని కోరారు.ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ మున్నవర్‌ను కలిసి తాగునీటి సమస్యపై వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు ప్రస్తుతం గ్రౌండ్ లెవెల్ వాటర్ గణనీయంగా తగ్గిపోవడం వల్లే నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.సమస్యను అత్యవసరంగా పరిగణించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టి ముత్యాలబాగ్ ప్రాంతానికి సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించడంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# నాలుగేళ్ల చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు శ్రీరంగం ఫౌండేషన్ ప్రోత్సాహక బహుమతి..

**కూకట్ పల్లి జూన్ 18 వెలుతురు:**

చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంటున్న నాలుగేళ్ల బాలిక శాస్త్ర మహీకి శ్రీరంగం ఫౌండేషన్ ప్రోత్సాహక చేయూత అందించింది. ఫౌండేషన్ కో-చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతుల మీదుగా మాదాపూర్ లోని సంస్థ కార్యాలయంలో నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. జంగాల రాజేష్–నవ్య దంపతుల కుమార్తె అయిన శాస్త్ర మహీ చిన్ననాటి నుంచే ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి కనబరుస్తూ భక్తి మార్గంలో ముందుకు సాగుతోంది. ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వహించిన ఆన్‌లైన్ హనుమాన్ చాలీసా పోటీలో పాల్గొన్న ఆమె, కేవలం నాలుగు నిమిషాల్లో ఎలాంటి తడబాటు లేకుండా హనుమాన్ చాలీసాను అనర్గళంగా పారాయణం చేసి విశేష ప్రశంసలు అందుకుంది.అంతే




కాకుండా చదువు, ఆటలు, నాట్యం తదితర రంగాల్లోనూ ప్రతిభ కనబరుస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. చిన్నారి సాధించిన విజయాలను గుర్తించిన శ్రీరంగం ఫౌండేషన్ ఆమెను సత్కరించి ప్రోత్సాహక నగదును అందించింది. ఈ సందర్భంగా ఇందుమతి శ్రీరంగం మాట్లాడుతూ, పిల్లలలో ఉన్న సహజ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, సమాజం బాధ్యత అని అన్నారు. విద్యతో పాటు కళలు, క్రీడలు, ఆధ్యాత్మిక రంగాల్లోనూ పిల్లలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. కష్టపడి సాధన చేస్తే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని, పట్టుదలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. వ్యక్తిగత విజయాలతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే బాధ్యతగల పౌరులుగా పిల్లలు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని చిన్నారి శాస్త్ర మహీకి అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఇంజాపూర్ లో జిల్లా పరిషత్ పాఠశాలలో సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

- ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవా కార్యక్రమాలు అభినందనీయం
- విద్యాభివృద్ధికి రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 18:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంజాపూర్ గ్రామంలో జిల్లాపరిషత్ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సందర్భంగా మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జీవించేవారు నిజమైన ధన్య జీవులనుఇంజాపూర్ కు చెందిన బొక్క భూ పాల్ రెడ్డి అనేవ్యక్తి తన 83వ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పాఠశాలకిచ్చిన యూనిఫాంపుస్తకాలు ప్లేట్లుఇ తర వస్తువులను విద్యార్థులకు అందజేశారు భూపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎ మ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు పిల్లల భవిష్యత్ కోసం భూపాల్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవా కార్య క్రమాలు నిర్వహించటంపట్ల మల్ రెడ్డి రంగారెడ్డి అభినందనలు తెలిపారు సమాజంలో సేవాధృ క్ప థం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.తమకున్నదానిలో కొంత ఇతరులకు పంచిన ప్పుడే ఉన్న తమైన సమాజం నిర్మితమవుతుందని చెప్పారు రాష్ట్ర ప్రభుత్వం విద్యకోసం ప్రత్యేక దృష్టి సారించిందన్న ఎమ్మెల్యే సరికొత్త విధానాలతో భవిష్యత్తుకు బంగారుబాటలలు వేస్తున్నట్లు చెప్పారు భూపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు ఈకార్యక్రమంలో రాష్ట్రరోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్ స్థానికనాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై తెలుగు వైద్యురాలి పరిశోధనకు అరుదైన గుర్తింపు

- క్యాన్సర్ రోగుల సంరక్షణలో హైదరాబాద్ MNJ క్యాన్సర్ ఆసుపత్రి సరికొత్త మైలురాయి!

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (Cervical Cancer) బారిన పడి, రేడియోథెరపీ చికిత్స తీసుకున్న మహిళల పునరావాసం మరియు వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆరతి అర్ధ చేసిన విశేష పరిశోధనకు అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక 'ESMO గైనకాలజికల్ క్యాన్సర్స్ కాంగ్రెస్' వేదికపై ఆమె సమర్పించిన పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ మెరిట్ అవార్డు దక్కింది.

**పరిశోధన నేపథ్యం - రోగుల సమస్యలు:**


గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు రేడియోథెరపీ చికిత్స అందించిన తర్వాత చాలా మంది మహిళల్లో 'వెజైనల్ స్టెనోసిస్' అనే దీర్ఘకాలిక దుష్ప్రభావం కనిపిస్తుంది. ఇది మహిళల్లో తీవ్రమైన శారీరక, మానసిక వేదనకు మరియు లైంగిక సమస్యలకు దారితీస్తుంది. ఈ సమస్య నివారణకు 'వెజైనల్ డైలేటర్ థెరపీ (VDT)' అత్యంత అవసరమైనప్పటికీ, అవగాహన లోపం, సామాజిక అడ్డంకులు మరియు ప్రభుత్వ ఆసుపత్రులలో డైలేటర్ కిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల గతంలో దీని వినియోగం శూన్యంగా ఉండేది.

**MNJ ఆసుపత్రిలో నాణ్యత పెంపుదల చొరవ**

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో, హైదరాబాద్‌లోని ఎమ్ఎన్‌జె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ (MNJIO&RCC) లో నేషనల్ క్యాన్సర్ గ్రిడ్–EQUIP ప్రోగ్రామ్ కింద డాక్టర్ ఆరతి అర్ధ మరియు వారి బృందం ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.రోగులకు స్థానిక భాషలైన తెలుగు మరియు హిందీలలో ప్రత్యేక కౌన్సెలింగ్ మెటీరియల్ తయారు చేసి అవగాహన కల్పించారు. అలాగే ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ (OPD) లోనే నేరుగా అన్ని సైజుల డైలేటర్ కిట్లను ఉచితంగా అందుబాటులో ఉంచేలా ఒక క్రమబద్ధమైన వ్యవస్థను (SOP) ఏర్పాటు చేశారు.

**100 శాతం అద్భుత ఫలితాలు:**

ఈ కొత్త విధానాన్ని అమలు చేసిన కొద్ది కాలంలోనే ఊహించని రీతిలో అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. గతంలో 'సున్నా' శాతంగా ఉన్న డైలేటర్ థెరపీ లభ్యత,



కేవలం కొన్ని నెలల్లోనే క్రమంగా పెరుగుతూ 100 శాతానికి చేరుకుంది. ఫాలో–అప్ కి వచ్చిన 263 మంది క్యాన్సర్ రోగులలో దాదాపు 86.3% (227 మంది) మహిళలు ఈ చికిత్సా విధానాన్ని విజయవంతంగా పొందారు. తక్కువ ఖర్చుతో కూడిన ఈ వ్యూహం రోగులలో మానసిక ధైర్యాన్ని, సంతోషాన్ని నింపిందని, క్యాన్సర్ నయమైన తర్వాత వారి సాధారణ జీవితానికి ఇది ఎంతో తోడ్పడిందని పరిశోధనలో తేలింది.వనరులు తక్కువగా ఉన్న ప్రభుత్వ వైద్య రంగంలో ఇలాంటి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యతా చొరవను విజయవంతంగా అమలు చేసి, అంతర్జాతీయ వేదికపై తెలుగు రాష్ట్రాల ప్రతిభను చాటిన డాక్టర్ ఆరతి అర్ధను పలువురు ప్రముఖులు, వైద్య నిపుణులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై సమగ్ర విచారణ జరపాలి

- ఆరుట్ల గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్

**మంచాల వెలుతురు జూన్ 18:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బిఆర్ ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానుపాటి కుమార్‌తో కలిసి విలేకరులతో ప్రభుత్వా ఆఫీషల్ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు వేదిక మీద ఏలవుంటారు అని ప్రస్తావించారు వారు మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సుమారు రూ12కోట్ల వ్యయం జరిగిన నేపథ్యంలో ఆ ఖర్చుపై సమగ్ర విచార ణ జరిపించాలని డిమాండ్ చేశారు అలాగే స్థానిక ఎమ్మెల్యే అసమర్థత కారణంగానేముఖ్యమంత్రి ఆరుట్ల గ్రామానికి ప్రత్యేక నిధులు ప్రకటించలేదని ఆరోపించారు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఆరుట్ల గ్రామానికి చెందిన విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తూ అడ్మిషన్లు కల్పించాలని మండలానికి చెందిన విద్యార్థులకు తగిన అవకాశాలు ఇవ్వాలని కోరారు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ రుట్ల గ్రామంలోని విద్యాసంస్థలను పట్టించుకునే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కృషితోనే గ్రామంలో విద్యారంగం అభివృద్ధి చెందిందని తెలిపారు బిఆర్ ఎస్ ప్రభుత్వ హ యాంలో బాలికల హైస్కూల్ భవనం బాలుర హైస్కూల్ భవనం మోడల్ స్కూల్ తదితర విద్యా సంస్థల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరుట్ల గ్రామంలో స్కూల్ గదులు లేవని చెప్పడంఆశ్చర్యకరమని గతంలో ఈ పాఠశాలల్లో సుమారు 1200 మంది విద్యార్థులు వి ద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారుస్కూల్ అభివృద్ధికి ప్రధాన కారణం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రె డ్డి అని అన్నారు ఆరుట్ల గ్రామసర్పంచ్ మానుపాటి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గ్రామానికి వచ్చిన సందర్భంలో గ్రామ సమస్య లపై మెమోరాండం అందించేందుకు ప్రయత్నించి నా అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు తాను గ్రామసర్పంచ్ అయినప్పటికీ తగిన గౌర వంలభించడం లేదని అన్నారు గ్రామానికి రోజుకు9లక్షల లీటర్ల తాగునీరు అవసరం కాగా ప్రస్తుతం 2 నుంచి 3 లక్షల లీటర్ల వరకు మాత్రమే సరఫరా అవుతోందని తెలిపారు అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రికి ప్రత్యేక మెమోరాండం అందజేసిను అని అన్నారు మెమోరాండం లోగ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ10 కోట్లు మంజూరు చేయాలిఆరుట్లలో డిగ్రీ కళాశాల ఏ ర్పాటు చేయాలిఅండర్ డ్రైనేజ్ సమస్యను శాశ్వతం పరిష్కారం కోసం యువత కోసం మినీ స్టేడియం ఏర్పాటు చేయాలిఆరుట్ల నుండి బుగ్గజాతర వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులుకే టాయించాలి ముఖ్యమంత్రి గ్రామఅభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు పూన్నం రాము బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నా యకులు మాడుగుల కృష్ణగౌడ్ నూతనగంటి శేఖర్ ఎండి జానీ పాషా చిందం రఘుపతి చిందం జంగయ్య.మంకు వినోద్ రావుల జంగయ్య గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాడుగుల బాల మణి మొర్రి పద్మ,ఐలయ్య నాయకులు ఎండి సద్దాం బర్మల వెంకటేష్ శివకుమార్ ఆమంచ రంజి త్ బైకని మైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్



ఆరుట్ల గ్రామంలో గతంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల




తర్వాత రూపుదిద్దుకున్న జిల్లా పరిషత్ పాఠశాల




ఆరుట్ల గ్రామంలో గతంలో నిర్మించిన తెలంగాణ ఆదర్శ పాఠశాల



ఆరుట్ల గ్రామంలో నేడు రూపుదిద్దుకున్న తెలంగాణ పబ్లిక్ పాఠశాల భవనం

# సొంత మండలాన్ని పట్టించుకోని మంత్రి

- రోడ్డు పనులు ఆలస్యంతో దుమ్మెత్తి పోస్తున్న జనాలు
- పుల్లెంల వెంకట్ గౌడ్

**నార్కెట్‌పల్లి, వెలుతురు జూన్ 18:**



నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియంతృత్వ పోకడల కారణంగా నార్కెట్‌పల్లి పట్టణం అభివృద్ధికి దూరమైందని బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు పుల్లెంల వెంకట్ ఆరోపించారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోట్ల రూపాయల నిధులతో పట్టణ సుందరీకరణ చేపట్టి, సెంట్రల్ లైటింగ్ డివైడర్, ఇరువైపులా ఆహ్లాదకరమైన రహదారుల మరమ్మత్తులు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు ప్రాధాన్యం లేకపోవడంతో పట్టణం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.గ్రామాల్లో స్థానిక నాయకుల పెత్తనం కొనసాగుతోందని, "ప్రజాపాలన" పేరుతో కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ఉందని, క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఇప్పటికీ బీఆర్ఎస్‌కే ఉందని పేర్కొన్నారు.శుక్రవారం నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కొప్పు ప్రవీణ్, తొగరవెల్లి నాగరాజు, పగిళ్ల శివశంకర్ ప్రసాద్, దుబ్బాక అరుణ్, అక్కెనపల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణిత ప్రతిభావంతులను ప్రోత్సహించిన దాసరి శ్రీరాములు

**నార్కెట్‌పల్లి, వెలుతురు జూన్ 18:**

ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన నేరడ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ గణిత ఉపాధ్యాయులు, నల్లగొండ జిల్లా తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు, ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న దాసరి శ్రీరాములు తన బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన నార్కెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను మరువలేదు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నార్కెట్‌పల్లిలో తాను పొందిన విద్య, జ్ఞానం, విజ్ఞానం తన పేదరికాన్ని జయించి ఉన్నత స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొంటూ, గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతి సంవత్సరం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా పాఠశాలలో నిర్వహించిన



కార్యక్రమంలో తన తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన "దాసరి సత్తమ్మ–సాయిలు విద్యా, సాహిత్య సేవా సంస్థ" ఆధ్వర్యంలో రూ.6,700 నగదు బహుమతులను అందజేసి గణితంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు.ఈ సందర్భంగా దాసరి శ్రీరాములు మాట్లాడుతూ, వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా సమాజాన్ని, దేశాన్ని అభివృద్ధి చేసే శక్తి విద్యకే ఉందని అన్నారు. గణితశాస్త్రం తార్కికత, ఏకాగ్రత, ఖచ్చితత్వాన్ని పెంపొందించే సబ్జెక్ట్ అని, విద్యార్థులు దానిని ఆసక్తితో అభ్యసించాలని సూచించారు.పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన దాసరి శ్రీరాములు, నేడు అదే పాఠశాలలోని విద్యార్థులను ప్రోత్సహించడం ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు వెంకటరాజు, సరిత, మంగమ్మతో పాటు ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, వారిని ప్రోత్సహిస్తున్న దాసరి శ్రీరాములు గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడిగా వెదిరె విజేందర్ రెడ్డి





**మునుగోడు,జూన్ 18(వెలుతురు):**

మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు గాను 25 గ్రామాల ఉప సర్పంచ్‌లు గురువారం కొంపల్లి గ్రామంలో సమావేశమై మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా కొంపల్లి ఉప సర్పంచ్ వెదిరె విజేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఉపాధ్యక్షుడిగా దోటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బొందు రవి,సహాయ కార్యదర్శిగా కంభంపాటి నిర్మల నరసింహ, కోశాధికారిగా దాసరి పావని రమేష్,ప్రచార కార్యదర్శిగా పోలగోని అంజయ్యను ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా చెరుకు సునీత సైదులు, మందుల అంజయ్య, ఉప్పునూతల సుగుణమ్మలను ఎంపిక చేశారు.నూతన కార్యవర్గ సభ్యులను ఉప సర్పంచ్‌లు అభినందించారు.

# 2001 -02 పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

- మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు
- సీసీ కెమెరాలు ప్రారంభించిన సర్పంచ్, అధికారులు, పోలీస్ శాఖ

**మునుగోడు వెలుతురు జూన్ 18 :**

మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల సౌకర్యార్థం 2001 – 2002 పూర్వ విద్యార్థులు అత్యంత ప్రతిష్టాత్మకంగా 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు.హెడ్మాస్టర్ బాల ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఓ విజయభాస్కర్,సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, ఎంఈవో మల్లేశం, ఏఎస్సై హబివుద్దీన్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డిలతో కలిసి 2001 – 02 పూర్వ విద్యార్థులు,పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు ప్రారంభించారు.ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల సెక్యూరిటీ అన్నారు. చదువుకున్న పాఠశాలలో పాఠశాల అభివృద్ధికై మేమున్నామంటూ 2001 ,2002 సంవత్సరం పూర్వ



విద్యార్థులు ముందుకు రావడం, పాఠశాల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినదనీయం అన్నారు. ఈ పూర్వ విద్యార్థులు పాఠశాలకు అభివృద్ధికి పునాదిగా అయ్యి పలువురు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు..పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మన ఊరు మనబడి మనం చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే మేము ముందడుగు వేశామన్నారు. పాఠశాల అభివృద్ధికి మేము మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా 2001 – 02 సంవత్సర పూర్వ విద్యార్థులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు..ఉపాధ్యాయులు కునూరెడ్డి సత్తిరెడ్డి, రత్నయ్య, అన్నపురెడ్డి,మహిళ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు,భవిత పాఠశాల చైర్మన్ పందుల ఎల్లమ్మ,గాలి సైదులు,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ళ ప్రణయ్ కుమార్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ.

**మునుగోడు, జూన్ 18(వెలుతురు):**



ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ కోరారు. గురువారం మండల పరిధిలోని పులిపల్పుల గ్రామం ప్రాథమిక పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజులుగా పాఠశాలలో 30 మంది నూతన విద్యార్థులను నమోదు చేయించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంభంపాటి జ్యోతి వెంకటేష్, ప్రధానోపాధ్యాయురాలు డి.కళావతి, పీఆర్టీయూటీఎస్ మునుగోడు అధ్యక్షుడు యూసుఫ్ పాషా, ఉపాధ్యాయులు రవీందర్,రోహిణి, నాగరాజు,స్వామి,మేరీ తదితరులు పాల్గొన్నారు.

# 33 జిల్లాల వృత్తిదారుల సమస్యలపై ఖాది బోర్డు సీఈఓకు వినతి

- బ్యాంకు రుణాలు, ఉపాధి అవకాశాలపై సమగ్ర నివేదిక సమర్పణ

**హైదరాబాద్, జూన్ 18 వెలుతురు :**

తెలంగాణ రాష్ట్ర ఖాది మరియు గ్రామీణ పరిశ్రమల మండలి కార్యాలయం, మసాబ్ ట్యాంక్, హైదరాబాద్‌లో సీఈఓ శ్రీ మంగతా నాయక్ గారిని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (TRKS) నాయకులు గురువారం కలిసి రాష్ట్రంలోని 33 జిల్లాల వృత్తిదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.వృత్తిదారులకు బ్యాంకు రుణాల మంజూరు, ఉపాధి అవకాశాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వృత్తి అభివృద్ధికి అవసరమైన చర్యలపై సమగ్ర నివేదికను అందజేశారు.



వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నడికుడ జయంత్ రావు గారి నాయకత్వంలో నిర్వహించబడింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్,రాష్ట్ర కోశాధికారి అమంచి రాజలింగం మరియు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర వృత్తిదారుల విభాగం అధ్యక్షులు గుండాల గోవర్ధన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, బ్యాంకు రుణాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని నాయకులు ఈ సందర్భంగా కోరారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**నార్కట్ పల్లి, వెలుతురు జూన్ 18:**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం పోతినేని పల్లె ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ ప్రజ్ఞాపురం ఉమా, ఉప సర్పంచ్ తనయుడు ఆదిమల్ల గణేష్ విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మరియు పెన్నులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ చిత్తలూరు మల్లికార్జున్ , అంగన్వాడి శంకరమ్మ, ఆది మల్ల గణేష్ పాల్గొన్నారు.



# ఆపదలో ఆదుకునే నాయకుడు తాటికొండ సైదులు

- కాలవర్షం బాధిత కుటుంబానికి చేయూత

**మునుగోడు, జూన్ 18 (వెలుతురు ):**

ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వామిగా నిలిచే మాజీ సర్పంచ్ తాటికొండ సంతోష్ సైదులు మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. ఇటీవల కురిసిన భారీ కాలవర్షాలకు మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన మోగుదాల లింగమ్మ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది.గాలివాన ధాటికి ఇంటి రేకులు ఎగిరిపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సైదులు వెంటనే స్పందించారు.సీనియర్ నాయకుడు ఏరుకొండ అంజయ్యతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రజలకు అవసరం ఉన్న ప్రతిసారి ముందుండి సహాయం చేయడం తాటికొండ సైదులు ప్రత్యేకత అని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సేవలే లక్ష్యంగా పనిచేస్తూ అనేక కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నా, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా తన వంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకునే నాయకుడిగా తాటికొండ సైదులు గుర్తింపు పొందారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. కాలవర్షం బాధిత కుటుంబానికి అందించిన సహాయం వారికి ఎంతో ఊరటనిచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జీడిమడ్ల సైదులు, వార్డు సభ్యురాలు ఏరుకొండ



భాగ్యలక్ష్మి–నాగేష్, పాంపాటి విజయ్ కుమార్, మాధగోని గణేష్, పాలకూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డిప్యుటేషన్‌పై భర్తీ చేయాలి

**డీఈఓకు భీమ్ ఆర్మీ వినతిపత్రం చర్యలు తీసుకోకుంటే కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 18:**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్) నార్కట్‌పల్లిలో ఖాళీగా ఉన్న తెలుగు, బయోసైన్స్ ఉపాధ్యాయ పోస్టులను డిప్యుటేషన్‌పై భర్తీ చేయాలని కోరుతూ భీమ్ ఆర్మీ నాయకులు నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)కి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, జెడ్పీహెచ్‌ఎస్ నార్కట్‌పల్లిలో ఒక స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), ఒక స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్) పోస్టులు దాదాపు సంవత్సరకాలంగా ఖాళీగా ఉన్నాయని, అదేవిధంగా ఒక స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉందని తెలిపారు.గత విద్యా సంవత్సరంలో జిల్లా కలెక్టర్ ఆమోదంతో విడుదలైన ఉత్తర్వుల ప్రకారం జెడ్పీహెచ్‌ఎస్ అమ్మనబోల్‌కు చెందిన శ్రీమతి ఎన్. శ్రీదేవి (తెలుగు), జెడ్పీహెచ్‌ఎస్ పలివెలకు చెందిన పి. రాఘవేంద్ర (బయోసైన్స్)లను నార్కట్‌పల్లి పాఠశాలకు తాత్కాలిక సర్దుబాటులో భాగంగా కేటాయించినప్పటికీ, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని రిలీవ్ చేయలేదని ఆరోపించారు. ఫలితంగా గత విద్యా సంవత్సరం మొత్తం తెలుగు, బయోసైన్స్ ఉపాధ్యాయులు లేకుండానే విద్యాబోధన కొనసాగిందని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు తెలుగు, బయోసైన్స్ సబ్జెక్టుల్లో పూర్తి స్థాయి బోధన అందలేదని ఆవేదన



వ్యక్తం చేశారు. ప్రస్తుతం జెడ్పీహెచ్‌ఎస్ నార్కట్‌పల్లి జిల్లాలో ఆదర్శవంతంగా నిర్వహించబడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటిగా నిలిచిందని, ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయ బృందం అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారని కొనియాడారు.2026–27 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అదనపు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి ఒక తెలుగు, ఒక బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై నార్కట్‌పల్లికి పంపించాలని డీఈఓను కోరారు. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ, నార్కట్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన ఉపాధ్యాయులను వెంటనే కేటాయించాలని, లేకపోతే భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ రావణ్ మహారాజ్ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, మహిమాన్విత, అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవం నేడు

- ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం...
- శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వార్షికోత్సవ వేడుకలు, పూజలు.
- వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్.

**కరీంనగర్ వెలుతురు జూన్ 18:**

కరీంనగర్ జిల్లాలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతు, కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవం, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి , శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా మారిన దివ్య పుణ్యక్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయ" షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 19 వ తేదీ శుక్రవారం రోజున జరగనున్న వార్షికోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అత్యంత వైభవంగా వేడుకలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. వార్షికోత్సవం రోజైన శుక్రవారం (జూన్ 19) నాడు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు.ఉదయం 4:30 నిమిషాలకు జగద్గురువుల కరకమలములచే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి , శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంతనాగేంద్ర స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేక పూజలు ,ఉదయం 8:00 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండల పూజలతో పాటు లోకకల్యాణార్థం లక్ష్మీగణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమము, పూర్ణాహుతి, మంత్రపుష్పం అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం (ఆశీర్వచనం), తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది.

### త్రిశక్తుల స్వరూపం - మహిమాన్విత దివ్య క్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయం

ఒకే దేవాలయ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం.

శ్రీ మహాదుర్గ:

భక్తులకు రక్షణను, ధైర్యాన్ని ప్రసాదించే శక్తి స్వరూపిణి.

శ్రీ మహాలక్ష్మి :

అష్టైశ్వర్యాలను, కుటుంబ సౌఖ్యాన్ని, వ్యాపార వృద్ధిని



ఇచ్చే లక్ష్మీదేవి.

శ్రీ మహాసరస్వతి:

చదువుల తల్లి, జ్ఞానాన్ని ప్రసాదించే విద్యా స్వరూపిణి. ల ఆధ్యాత్మిక నిలయం శక్తివంతమైన పూజా విధానాలతో అలరారే ఈ ఆలయం భక్తులకు నేడు సమస్త భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. 15 ఏళ్ల భక్తుల అచంచల విశ్వాసంతో ఈ ఆలయం కరీంనగర్ జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదిగింది. ఇక్కడి అమ్మవారిని దర్శించుకుని మనసారా మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, ముఖ్యంగా వ్యాపార వృద్ధి, చదువు, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని భక్తుల బలమైన నమ్మకం. అమ్మవారి ఆశీస్సులతో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న క్షేత్రంగా శ్రీ మహాశక్తి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా దేవాలయంలో కన్నుల పండుగగా అనేక ప్రధాన ఉత్సవాలు, పండుగ వేళల్లో ఉగాది, శ్రీ సీతారాముల కళ్యాణం, వసంత పంచమి, మహాశివరాత్రి, సంకటహర చతుర్థి, శ్రావణ మాస ప్రత్యేక పూజలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, వినాయక నవరాత్రులు, దీపావళి , తులసి కళ్యాణం, అయ్యప్ప స్వామి పడిపూజ , మార్గశిర మాసం– ధనుర్మాసం, రుద్ర సహిత చండీ హోమం, నాగుల పంచమి, చవితి లాంటి పర్వదినాల్లో ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రధానంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, అన్నదానాలు భారీ ఎత్తున దాండియా నృత్యాలు ఘనంగా ప్రతిఏటా నిర్వహిస్తారు. అలాగే విజయదశమి సమయంలో ఇక్కడ భవానీ మాల ధరించిన దీక్షాపరుల కోలాహలం ఎక్కువగా ఉంటుంది. విజయవాడ తర్వాత అదే స్థాయిలో భవాని మాల ధారులకు శ్రీ మహాశక్తి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ఏటా వేలాదిమంది దీక్షపరులు ఇక్కడ భవాని మాల ధారణ చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులు సైతం ఇక్కడ దీక్షలు చేపట్టడం విశేషం.శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే విశిష్ట పూజలు, భక్తి ప్రపత్తులకు నిలయమైందివిశేష పూజలకు, పర్వదినాల ఆధ్యాత్మికతకు, భక్తికి చిరునామాగా నిలుస్తున్న శ్రీ మహాశక్తి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రతిరోజూ అశేష సంఖ్యలో తరలివచ్చే ఈ క్షేత్రంలో, విశేష పర్వదినాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.దేవాలయంలో నిర్వహించే వేడుకలు పర్వదినాల్లో కోరికలను తీర్చే శ్రీ మహాశక్తిని దర్శించుకుని, విశేష పూజలలో పాల్గొని అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని భక్తులు పొందుతుంటారు. ఈనెల 19, శుక్రవారం రోజున జరిగే ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో, పూజా కార్యక్రమాలలో కూడా హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, త్రిశక్తి స్వరూపులైన శ్రీ మహాశక్తి దేవాలయ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## కరీంనగర్ నగరాభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 18:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు గురువారం 6వ డివిజన్ బొమ్మకల్ ప్రాంతంలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు శానిటేషన్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం 17వ మరియు 18వ డివిజన్లలో చేపడుతున్న మంచినీటి బావి తవ్వకం పనులను మేయర్ ప్రారంభించారు. నగర ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి





ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రైమరీ హెల్త్ సెంటర్) భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అలాగే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో మరియు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, అడిషనల్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి: తపస్

**మెదక్ వెలుతురు జూన్ 18:**

ప్రస్తుతము సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష )రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారికి వారి ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, కేంద్ర విద్యాశాఖ మంత్రి గారికి,దేశ ప్రధాని గారికి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఎన్నో పరీక్షల వడపోత తర్వాత టీచర్లుగా ఎంపికై న వారికి ఈ టెట్ పరీక్ష ఏమిటని వారు ప్రశ్నించారు. ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన టెట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి జిడ్డి ఎల్లం,జాల సిద్దు,రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుభాషి భాస్కర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్,మెతుకు రంగారెడ్డి,జిల్లా కోశాధికారి మంగ నర్సింలు,జిల్లా ఉపాధ్యక్షులు మాధవరెడ్డి,నర్సింలు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ త్రివేణివనం- ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

- హాజరైన ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్ వెలుతురు జూన్ 18 :**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన త్రివేణివనం–ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.35.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 11 ఎకో పార్కులు, అటవీ సిబ్బంది నివాస గృహాలను ప్రారంభించిన సందర్భంగా జహీరాబాద్‌లోని త్రివేణివనాన్ని కూడా ప్రజలకు అంకితం చేశారు.జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ ఎకో పార్కు ప్రకృతి ప్రేమికులకు, పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పచ్చదనం, జీవవైవిధ్యం, ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో ఈ పార్కును తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న తరహా సౌకర్యాలను ఇక్కడ కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణాన్ని నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిమ్జ్ ద్వారా జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతోందని, భారీ పరిశ్రమల



రాకతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం–ఫారెస్ట్ ఎకో పార్కును ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేశామని తెలిపారు. పార్కులో సైక్లింగ్, ప్రకృతి వీక్షణ, సఫారీ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.జహీరాబాద్ ఎమ్మెల్యే కె. మాణిక్‌రావు మాట్లాడుతూ త్రివేణివనం జహీరాబాద్ ప్రజలకు



గొప్ప వరమని పేర్కొన్నారు. చెట్లు ఉంటేనే మానవ మనుగడ సుసంపన్నంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం అతిథులు అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించారు. మొక్కలు నాటి, జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీ శాఖ, పోలీసు శాఖ అధికారులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్నార్ కార్మికుల భవిష్యత్తు కోసం 'చుక్క' గుర్తుకు ఓటు వేయండి

- జూన్ 20న పెన్నార్ పరిశ్రమలో యూనియన్ ఎన్నికలు
- కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం – కాట శ్రీనివాస్ గౌడ్
- మెరుగైన వేతన ఒప్పందం సాధించడమే లక్ష్యం - "కాట"

**బండ్లగూడ వెలుతురు జూన్ 18:**

బండ్లగూడ గ్రామంలోని పెన్నార్ పరిశ్రమలో ఈ నెల 20వ తేదీన జరగనున్న యూనియన్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ, పెన్నార్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం మరియు సంక్షేమం కోసం INTUC – CITU కూటమి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు, వారికి అనుకూలంగా మెరుగైన వేతన ఒప్పందం కుదిరేలా తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.యూనియన్ ఎన్నికల్లో INTUC & CITU కూటమి



అభ్యర్థులకు కార్మిక సోదరులు మద్దతు తెలపాలని, తమ అమూల్యమైన ఓటును "చుక్క" గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.కార్మికుల ఐక్యతే వారి బలమని, కార్మిక సంక్షేమం కోసం పోరాడే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని కాట శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

## శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**తెల్లాపూర్ వెలుతురు జూన్ 18:**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని తెల్లాపూర్ గ్రామం జ్యోతిరావు పూలే కాలనీలో గల శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ శివ పంచాయితీ సహిత నవగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఆయన భక్తిశ్రద్ధలతో వీక్షించి, దేవతలను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు కాట శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సాంస్కృతిక విలువల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.





# నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం: సైబరాబాద్ సీపీ

- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నేర సమీక్ష సమావేశం*
- పెండింగ్ కేసుల పరిష్కారం, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**సైబరాబాద్ వెలుతురు జూన్ 18:**





సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారం, కోర్టు వ్యవహారాల పురోగతి మరియు ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్., అధ్యక్షతన సైబరాబాద్ సీపీ ఆఫీసులోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనరేట్ పరిధిలోని జోనల్ డీసీపీలు, అదనపు డీసీపీలు, క్రైమ్ విభాగాల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, కోర్టు కేసులు, పీటీ కేసులు, ఈఓడబ్ల్యూ కేసులు, యూఐ కేసులు, కిడ్నాప్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, పోక్సో, అత్యాచారం, హత్య కేసులు మరియు ఇప్పటి వరకు ఛేదించని గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని సీపీ సమీక్షించారు. తీవ్రమైన నేరాల దర్యాప్తులో వేగం పెంచి, నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు అన్ని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు.మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యంతో విచారించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జీరో ఎఫ్ఐఆర్ కేసుల నమోదు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన మరియు బదిలీ చేసిన కేసుల వివరాలను సమీక్షించి, బాధితులకు తక్షణ సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు.డయల్-100 కాల్స్‌కు స్పందన, ఫుట్ పెట్రోలింగ్, క్షేత్రస్థాయి పోలీసింగ్, సీడీవోల విధుల నిర్వహణ, నేర నియంత్రణలో కన్విక్షన్ రేటు పెంపు అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి, కోర్టుల్లో శిక్షలు పడే శాతాన్ని పెంచేందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ (CCTNS) డేటా అప్‌డేషన్, ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ విధానం అమలు, సైబర్ నేరాల దర్యాప్తు, ఆర్థిక నేరాల విచారణ మరియు డిజిటల్ రికార్డుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసుకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అప్‌డేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు.అదేవిధంగా డ్రగ్స్ నిర్మూలన చర్యలు, కార్మిక శిబిరాల (లేబర్ క్యాంప్స్) పరిస్థితులు, పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ఐటీ కారిడార్, ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. సమావేశం ముగింపులో సీపీ డా. ఎం. రమేశ్ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ మరియు బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారం, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి" అని సూచించారు.ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యు అండ్ సీఎస్డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్ హెచ్ ఓ లు తదితరలు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో పలు రోడ్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవంలో పాల్గొననున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- మహేశ్వరం,ఇబ్రాహీంపట్నం నియోజకవర్గాల్లో రేపు(శుక్రవారం) నాడు రూ.87కోట్ల విలువైన CRF పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**



రంగారెడ్డి జిల్లాలో నేడు (శుక్రవారం) రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు పలు రోడ్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనన్నున్నారు.మహేశ్వరం,ఇబ్రాహీంపట్నం నియోజకవర్గాల్లో చేపట్టిన,పూర్తయిన సుమారు రూ.87కోట్ల విలువైన CRF రోడ్ల పనులకు ఉదయం 9:30 గంటల నుండి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి గారితో కలిసి రాష్ట్ర R&B మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు.

పనుల వివరాలు:

1. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరు గ్రామంలో 38కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే 14కి.మీ డబుల్ లేన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

(లేమూరు - శ్రీశైలం హైవే - తిమ్మాపూర్ వయా అగర్మియాగూడ)

2.బేగంపేట గ్రామంలో 17కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే 6.2కి.మీ డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

(బేగంపేట - ఎలిమినేడు - వయా మాదాపూర్)

3.తిమ్మాపూర్ గ్రామంలో RCI గేట్ నుండి మీర్ ఖాన్ పేట్ వరకు 30 కోట్ల వ్యయంతో నిర్మించిన 22కి.మీ రోడ్డును ప్రారంభిస్తారు.

(వయా రావిర్యాల,కొంగరకలాన్,తిమ్మాపూర్,మాదాపూర్,గుమ్మడవల్లి, ఆకుల మైలారం)

## వర్షాకాల సన్నద్ధత, వాటర్ లాగింగ్ పాయింట్లు మరియు ట్రాఫిక్ నిర్వహణపై PSIOCలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం

**సైబరాబాద్ వెలుతురు జూన్ 18:**







తెలంగాణ మెట్రోపాలిటన్ ఏరియా మరియు అర్బన్ డెవలప్‌మెంట్ (HMDA) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన గురువారం రోజున సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్(PSIOC) లో వర్షాకాల సన్నద్ధత, వాటర్ లాగింగ్ పాయింట్లు మరియు ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజన, సైబరాబాద్ పరిధిలోని డీసీపీలు మరియు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సమావేశంలో భారత వాతావరణ శాఖ (IMD) అంచనాలు మరియు హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో ఎదురయ్యే పరిస్థితులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. నగర పరిధిలోని మైనర్, మీడియం మరియు మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జయేష్ రంజన్ సూచించారు. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి రోడ్లపై బ్రేక్‌డౌన్ అయ్యే వాహనాలను వీలైనంత వేగంగా తొలగించి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట్ల డ్రోన్లను వినియోగించి ట్రాఫిక్ పరిస్థితులను పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రజా రవాణా వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు మరియు ఇతర సంస్థలు స్కూల్ బస్సులు ఇతర సామూహిక రవాణా సదుపాయాలను విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గడం ద్వారా ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

వర్షాకాల అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ, సీఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ పోలీసులు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలను వివరించగా, వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జయేష్ రంజన్ సూచించారు.

## బీఆర్ఎస్ సమావేశంలో ఉద్రిక్తత కుర్చీలు విరగ్గొట్టి స్టేజీపైకి దూసుకెళ్లిన నేతలు

- భద్రాద్రి కొత్తగూడెంలో సభ్యత్వ నమోదు సమావేశంలో గందరగోళం
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు వ్యాఖ్యలతో రచ్చ
- రాఘవపై చేసిన వ్యాఖ్యలకు అనుచరుల ఆగ్రహం
- కుర్చీలు ధ్వంసం.. స్టేజీపైకి దూసుకెళ్లిన కార్యకర్తలు
- సభలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు
- నేతల జోక్యంతో సద్దుమణిగిన వివాదం
- పార్టీ సమావేశంలో గందరగోళం
- కార్యకర్తల మధ్య తోపులాట
- వాగ్వాదం ఉద్రిక్తతకు దారి
- సభ్యత్వ కార్యక్రమంలో అపశృతి



**కొత్తగూడెం వెలుతురు జూన్ 18:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పార్టీ నాయకుల మధ్య జరిగిన మాటల యుద్ధం కార్యకర్తల ఆగ్రహానికి దారితీయడంతో సమావేశం కొద్దిసేపు గందరగోళంగా మారింది.సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు రాఘవను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని, పార్టీ సస్పెన్షన్ అమలుపై వ్యాఖ్యానిస్తూ "తాట తీస్తా" అంటూ హెచ్చరించినట్లు సమాచారం.ఈ వ్యాఖ్యలతో ఆగ్రహించిన రాఘవ అనుచరులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. కుర్చీలు విరగ్గొడుతూ స్టేజీపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో సభా ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో సమావేశానికి అంతరాయం ఏర్పడింది.పార్టీ సీనియర్ నాయకులు, ఇతర బాధ్యులు వెంటనే జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం సమావేశం కొనసాగినట్లు సమాచారం. ఈ ఘటన జిల్లాలో బీఆర్ఎస్ అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయనే చర్చకు దారితీసింది.

## మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అంటేనే ధైర్యం

- 25 ఏళ్ల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఆర్ఎస్ఐ జంగయ్య
- నల్గొండలో మాజీ మంత్రి మోత్కుపల్లిని సన్మానించిన జంగయ్య
- తమ్మి జంగయ్య అంటూ సోదరుడిలా ఆదరించేవారని భావోద్వేగం

**నల్గొండ, వెలుతురు జూన్ 18 :**





మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో తనకు దాదాపు 25 సంవత్సరాల పాటు కొనసాగిన అనుబంధాన్ని నల్గొండలో ఆర్ఎస్ఐ జంగయ్య గుర్తుచేసుకున్నారు. మోత్కుపల్లి నర్సింహులు మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్న కాలం నుంచి పదవులు లేని సమయంలోనూ తాను గన్‌మెన్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. మోత్కుపల్లి నర్సింహులు తనను ఎప్పుడూ 'తమ్మి జంగయ్య' అని ఆప్యాయంగా పిలుస్తూ సొంత సోదరుడిలా భావించేవారని జంగయ్య పేర్కొన్నారు. ప్రజా సమావేశాలు, రాజకీయ కార్యక్రమాల సందర్భంగా మోత్కుపల్లి 'తమ్మి జంగయ్య' అని పిలిచిన వెంటనే కార్యకర్తలు, సిబ్బంది అప్రమత్తమయ్యేవారని ఆయన గుర్తుచేశారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజాసేవలో మోత్కుపల్లి నర్సింహులు ఎప్పుడూ ముందుండేవారని జంగయ్య అన్నారు. తనకు ఆర్ఎస్ఐగా పదోన్నతి రావడంతో గన్‌మెన్‌గా కొనసాగడం సాధ్యం కాక నల్గొండకు బదిలీ అయినప్పటికీ, మోత్కుపల్లి తన యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారని చెప్పారు. తనకు తీవ్ర అనారోగ్య సమస్యతో శస్త్రచికిత్స జరిగిన సమయంలో కూడా మోత్కుపల్లి నర్సింహులు ఆసుపత్రిలో ఉండి ధైర్యం చెప్పారని, కుటుంబ సభ్యుడిలా అండగా నిలిచారని జంగయ్య తెలిపారు. గన్‌మెన్‌గా చేసిన సేవలు, కలిసి చేసిన ప్రయాణాలు, అనేక కార్యక్రమాలు, మధుర జ్ఞాపకాలు తనకు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఇటీవల మోత్కుపల్లి నర్సింహులు నల్గొండలోని తన నివాసానికి విచ్చేసిన సందర్భంగా జంగయ్య శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ దాదాపు గంటపాటు ఆప్యాయంగా ముచ్చటించారు. నల్గొండ ఆర్ఎస్ఐగా పదోన్నతి పొంది విధులు నిర్వహిస్తున్న జంగయ్యకు మోత్కుపల్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ 'మోత్కుపల్లి అంటే ధైర్యం, నమ్మకం, ఆప్యాయతకు ప్రతీక' అని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

- పోలగాని వెంకీ గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**





భారతదేశ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న గౌరవనీయులు శ్రీ రాహుల్ గాంధీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.సత్యం, సామాజిక న్యాయం, సమానత్వం అనే విలువలను ముందుకు తీసుకెళ్తూ దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తున్న మీ నాయకత్వం మరింత బలపడాలని ఆకాంక్షిస్తున్నాము.మీరు ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో, మరెన్నో విజయాలను సాధిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

## తేనెటీగల సంరక్షణే మానవ మనుగడకు భరోసా

- శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై రెండు రోజుల జిల్లా సెమినార్ ప్రారంభం

**జహీరాబాద్ వెలుతురు జూన్ 18 :**





డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్) కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, ఎన్.ఐ.-ఎం.ఎస్.ఎం.ఈ, యూసఫ్‌గూడ, హైదరాబాద్ సహకారంతో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై రెండు రోజుల జిల్లా స్థాయి సెమినార్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జూన్ 18 మరియు 19 తేదీల్లో నిర్వహించబడుతోంది.సెమినార్‌లో భాగంగా డిడిఎస్-కేవీకేలో రైతులు, మహిళలు, యువతీ యువకులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఎపికల్చర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ పంటల్లో పరాగసంపర్కం పెంపొందించేందుకు, తేనె ఉత్పత్తి సాధనకు ఉపయోగపడే తేనెటీగ పెట్టెలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా యూరోపియన్ జాతికి చెందిన "ఏపీస్ మెల్లిఫెరా" మరియు భారతీయ జాతికి చెందిన "ఏపీస్ సెరానా" తేనెటీగ బాక్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా డిడిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. దివ్య వెలుగురి మాట్లాడుతూ తేనెటీగలు మానవ మనుగడ, వ్యవసాయం మరియు పర్యావరణ సమతుల్యతకు అత్యంత కీలకమని తెలిపారు. పంటల పరాగసంపర్కంలో తేనెటీగల పాత్ర అపారమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.డిడిఎస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా. సి. వరప్రసాద్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అధిక వినియోగం, కాలుష్యం తదితర కారణాలతో తేనెటీగల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తేనెటీగలు అంతరించిపోతే పరాగసంపర్క వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోవడంతో ఆహార సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.జహీరాబాద్ మండల ఉద్యాన శాఖ అధికారి పండరి మాట్లాడుతూ తేనెటీగల పెంపక శిక్షణ పొందిన రైతులకు ఆర్ఏడీ (RAD) పథకం ద్వారా తేనెటీగ పెట్టెలను 40 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. ఉద్యాన శాఖలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బీకీపర్ పరిపూర్ణ మాట్లాడుతూ తేనెటీగల పెంపకం ద్వారా కేవలం తేనె మాత్రమే కాకుండా మైనం, పుప్పడి, రాజాహారం, ప్రొపోలిస్, తేనెటీగ విషం వంటి విలువైన ఉత్పత్తులను తయారు చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో కేవీకే బృందం, రైతులు, మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తేనెటీగల పెంపకం, వాటి సంరక్షణ మరియు ఆర్థిక అవకాశాలపై అవగాహన పొందారు.

# ఈ రెండున్నరేళ్ల కాలంలోనే 66,038 రైతు కుటుంబాలకు 3301.90 కోట్ల రైతుబీమా చెల్లింపు

- ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియం ను చెల్లించాం: మంత్రి
- రైతు పక్షపాత ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలి
- పథకాలను నిలిపివేసిన చరిత్ర గత ప్రభుత్వానిది.. పునరుద్ధరిస్తున్న ఘనత మాది

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. రైతు బీమా పథకాన్ని నిలిపి వేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా



ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు.

ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు.2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు స్పష్టం చేశారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ సహా పలువురు నాయకుల అరెస్టు
- సచివాలయం వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులు
- అడ్డుకున్న పోలీసులు.. సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్తత
- విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని బీసీ సంఘాల హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**



రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సచివాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం వారిని గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా అరెస్టయిన వారిలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు ఉన్నారు.ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిల కారణంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఉన్నత విద్యకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## సర్వర్ నిర్వహణ పనుల దృష్ట్యా ఈ నెల 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలకు తాత్కాలిక విరామం

- జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలు షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.సుమారు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ సర్వర్ నిర్వహణ పనుల ద్వారా సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమని ఆయన పేర్కొన్నారు.అయితే జూన్ 26న మొహరమ్, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో, మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించామని తెలిపారు.ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు.శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఓబీసీ మోర్చా నాయకులు అడిచర్ల రాజు, ఆకుల రాజేందర్

- మానకొండూరు నియోజకవర్గంలో ఘనంగా 'జనకల్యాణ్' కార్యక్రమం

**మానకొండూరు, వెలుతురు జూన్ 18:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని, తద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా కన్వీనర్ ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోడీ పాలన 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, 'జన కల్యాణ్' కార్యక్రమంలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన వృత్తి కళాకారులకు, ఓబీసీలకు ఈ పథకం ఒక వరం లాంటిదని, దీనిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సూచించారు. ఓబీసీ వర్గాలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధికి ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు.పర్యావరణం -ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలని , రాబోయే పక్షం రోజుల పాటు చెట్లు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ ప్రబారి మియాపూర్ లక్ష్మాచారి, మండల కన్వీనర్లు గోరిశెట్టి రమేష్, అంబటి స్వామి, వెంగల ప్రవీణ్, నెట్టు అంజయ్యలతో పాటు బీజేపీ నాయకులు దూలం కిరణ్, టంగుడు రాజ్ కుమార్, విష్ణువర్ధన్, నందగిరి బలరాం, పుట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





## SIR (ఓటరు సవరణ ప్రక్రియ) పై అప్రమత్తంగా ఉండాలి

- బిఎల్ ఏ 2 ల లిస్ట్ ఈఆర్వో లకు అందించాలి
- అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగించకుండా బూత్ లెవెల్ ఏజెంట్ లు చురుకుగా ఉండేలా నియోజకవర్గ ఇంచార్జ్ లు పని చేయాలి
- ప్రతి ఒక్కరి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం బిఎల్ఓ లకు అందేలా బి ఎల్ ఏ 2 లు చూసుకోవాలి
- ప్రభుత్వ పథకాలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి*
- రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం చేయాలి
- హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**





హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సచివాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఓటరు సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (BLOలు) అందించే ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి అర్హ ఓటరికి చేరేలా బూత్ లెవల్ ఏజెంట్లు (BLA-2లు) ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే బీఎల్ఏలకు అందజేయాలని, బీఎల్ఏలు (డీసీసీ అధ్యక్షులు) ఆయా జాబితాలను ఎన్నికల నమోదు అధికారులకు (EROలు) సమర్పించాలని సూచించారు.2002లో జరిగిన ఓటరు సవరణ ప్రక్రియలో అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించకుండా అధికారులు వ్యవహరించారని గుర్తు చేసిన మంత్రి, ప్రస్తుతం జరుగుతున్న SIR ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు సవరణ ప్రక్రియ లో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్ర చేస్తుందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ , తమిళనాడులో లక్షలాది ఓట్లను తొలగించారని తెలంగాణ లో అలా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి చేరేలా చూడాలని తెలిపారు. ఓటరు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించకపోతే జూలై 30న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యత అని మంత్రి అన్నారు. మరణించిన లేదా అనర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులను గుర్తించి నమోదు చేయించాలని, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సకాలంలో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడు తన పరిధిలో బూత్‌ల వారీగా సమీక్షలు నిర్వహించి, ప్రజలకు దరఖాస్తుల నింపడం, ఆన్‌లైన్ నమోదు వంటి అంశాల్లో సహాయం అందించాలని కోరారు.ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరును చేరుకునేలా పార్టీ నాయకులు పనిచేయాలని అన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలైన సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సాధికారత కార్యక్రమాలు, మహిళలను బస్సు యజమానులుగా తీర్చిదిద్దే పథకాలు తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేలా పార్టీ బలోపేతం దిశగా ప్రతి నాయకుడు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.సమావేశంలో పాల్గొన్న మంత్రి అజారుద్దీన్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి,రఘురాం రెడ్డి,డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్ , దీపక్ జాన్ , సయ్యద్ ఖలీద్ సైఫుల్లా , ఎమ్మెల్యేలునవీన్ యాదవ్,శ్రీ గణేష్, నియోజవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎన్ఎస్యుఐ ప్రెసిడెంట్ వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ కోసం సచివాలయం ముట్టడి

- ముట్టడిని అడ్డుకొని బీసీ సంఘాల నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- అరెస్ట్ చేసిన బీసీ నేతలను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు
- పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్మెంట్ అమలు చేయాలనీ డిమాండ్
- ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తుంది
- గత నాలుగు ఏళ్లుగా ఫీజుల బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం బీసీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుంది
- తక్షణమే ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే సీఎం, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటాం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 18:**





ఫీజుల రియంబర్స్మెంట్ దశలవారీగా రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని అందులో భాగంగానే జీవో ఏడును రద్దు చేసినట్టే చేసి ఎనిమిది తొమ్మిది జీవోలను తెచ్చి బీసీలకు ఉరితాడు బిగించిందని బీసీ సంఘాల నేతలు ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. గురువారం హైదరాబాదులో ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ తో సచివాలయం ముట్టడికి బీసీ సంఘాల నేతలు విఫల ప్రయత్నం చేశారు.సచివాలయాన్ని ముట్టడిస్తారని ముందస్తు సమాచారంతో వందలాది మంది పోలీసులు సచివాలయం ముట్టడికి దశల వారీగా వస్తున్న బీసీ సంఘాల నేతలు ఎక్కడికక్కడే అడ్డుకొని సచివాలయం ముందు అరెస్టులు చేశారు, అరెస్టు చేసిన బీసీ నేతలను గోషామహల్, హ్యాబిట్స్ పోలీస్ స్టేషనులకు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టు అయిన బీసీ సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్, కనకాల శ్యామ్, జాజుల లింగం, మణి మంజరి లు మీడియా తో మాట్లాడారు. రెండు మూడు రోజులు ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే సీఎం, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని వారి హెచ్చరించారు, శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చిన తమను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అరెస్టులతో ఫీజు పోరు ఉద్యమాన్ని ఆపలేరు: జాజుల శ్రీనివాస్ గౌడ్**

పాత పద్ధతిలోనే ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలని, 14 లక్షల మంది విద్యార్థుల కు రావలసిన 7వేల కోట్ల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని గత సంవత్సర కాలంగా శాంతియుతంగా దీక్షలు ధర్నాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈరోజు బీసీ శ్రేణులు సచివాలయం ముట్టడికి ప్రయత్నించారని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సచివాలయం ముట్టడిగా పాల్గొన్న బీసీ సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి ఘోషమాహల్, హాబిట్స్ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడంతో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ శాసన మండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారీ లు పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారిని పరామర్శించారు అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడారు.

సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సచివాలయం ముందు శాంతియుత నిరసన చేపట్టాలని ప్రయత్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం చాలా అన్యాయం అన్నారు, బీసీ విద్యార్థులు ఫీజుల రియంబర్స్మెంట్ కోసం చేసే పోరాటం న్యాయమైనదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలను విడుదల చేసి, ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేని పక్షంలో బీసీల పోరాటానికి టిఆర్ఎస్ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన హెచ్చరించారు.సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో అరెస్ట్ అయిన నాయకులు బి.మనిమంజరి, జాజుల లింగం గౌడ్, బొల్లిపల్లి స్వామి గౌడ్, పానుగంటి విజయ్ గౌడ్, బూడిద మల్లికార్జున యాదవ్, మాదేశి రాజేందర్, తారకేశ్వరి, ఇంద్రం రజక, వరుణ్ కుమార్, మహేష్ మేరు, సంపత్ నాయుడు, మధు యాదవ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, అనంతుల సాయి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- గన్ పార్కు వద్ద అరెస్టులు

**హైదరాబాద్,వెలుతురు జూన్ 18:**

రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్

(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ అమర వీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని,

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే






రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, జిల్లా నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు, శ్రీనివాస్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోవిందరావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, శివకుమార్ గౌడ్, డప్పు రామస్వామి, వాసాల బాలరాజు, శ్రీశైలం, నామమోహన్, దుర్గారావు, ప్రవీణ్, రమేష్, కొండల్ రెడ్డి, శ్యామ్ ముద్రాజ్, మంజులరెడ్డి, సుస్మిత, స్వప్న, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్యాబినెట్ పేరుతో అన్నదాతకు ద్రోహం: హరీష్ రావు

- కాంగ్రెస్ క్యాబినెట్ నిర్ణయాలు పక్కా రైతు వ్యతిరేకం
- ధాన్యం కొనుగోళ్ల బాధ్యత నుండి ప్రభుత్వం చేతులెత్తేసింది
- రేవంత్ రెడ్డి చేతకానితనాన్ని మంత్రులే స్వయంగా ఒప్పుకున్నారు
- ఏపీకి నీళ్లు దారపోసి ఎల్‌నినో సాకులు చెప్పడం సిగ్గుచేటు
- రూ. 16,545 కోట్ల రైతుభరోసా బకాయిలను వెంటనే జమ చేయాలి

**హైదరాబాద్, వెలుతురు జూన్ 18:**




కాంగ్రెస్ ప్రభుత్వం డిజిటల్ క్యాబినెట్ పేరుతో తీసుకున్న తాజా నిర్ణయాలు రాష్ట్ర అన్నదాతకు తీవ్ర ద్రోహం చేసేలా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంట బోనస్‌కు కోతలు పెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లలో చేతులెత్తేసి రైతులను దారుణంగా వంచించిందని మండిపడ్డారు. రోజుకో వింత నిర్ణయం, చెత్త విధానాలతో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన 'డిస్ట్రక్టివ్ క్రియేటివిటీ'తో రైతుల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపించారు. కేంద్ర కోటాల సాకు చూపి వరి కొనుగోళ్లపై షరతులు, పరిమితులు విధిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆగం కావడం ఖాయమని హెచ్చరించారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పంటలు కొనడం చేతకాదా అని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఎందుకు కేంద్రాన్ని సాకుగా చూపి రైతుల గొంతు కోస్తున్నారని హరీష్ రావు ప్రశ్నించారు. పంట మార్పిడి చేయమని ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, శనగలు పండించిన రైతుల పరిస్థితి నేడు రోడ్డు పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో శనగలు, జొన్నలకు కనీస మద్దతు ధర లభించక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకే అమ్ముకుంటూ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వరి కొనుగోళ్లపై కూడా షరతులు, పరిమితులు విధిస్తే రైతుల బతుకులు ఆగం కావడం ఖాయమన్నారు. కేసీఆర్ గారు రైతన్నను రాజుగా చేస్తే, రేవంత్ రెడ్డి దివాళా తీసే కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు.ప్రాజెక్టుల్లో తెలంగాణకు రావాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు వదిలేసి, ఇప్పుడు రైతులకు "నీళ్లు లేవు కాబట్టి పంటలు చూసుకుని వేయండి" అని చెప్పడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని హరీష్ రావు ధ్వజమెత్తారు. కృష్ణా జలాలపై ఏపీ ఇప్పటికే అధికంగా నీటిని తరలించిందని తెలిసినా, మళ్లీ 10 టీఎంసీల నీటిని ఏపీకి ఎందుకు వదిలారని ప్రశ్నించారు. ఒకవైపు నీళ్లు లేవని చెబుతూ, మరోవైపు ఏపీ ప్రయోజనాల కోసం పనిచేస్తూ ఎల్‌నినో పేరుతో తప్పించుకునే ప్లాన్ వేయడం సిగ్గుచేటన్నారు. సాకులు వెతుకుతూ పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తే తెలంగాణ రైతాంగం నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.రైతుభరోసా నిధులు విడుదల చేయడానికి బహిరంగ సభలు ఎందుకని హరీష్ రావు ఆక్షేపించారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన నిధులతో పాటు, గతంలో పెండింగ్‌లో ఉంచిన మూడు విడతల రైతు భరోసా బకాయిలు మొత్తం రూ. 16,545 కోట్లు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ నెల 30న మధిర వేదికగా నిర్వహించే సభలోనే ఈ బకాయిల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు. డిజిటల్ క్యాబినెట్ పేరుతో తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు.

# జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి షాక్



- పరిమళ్ నత్వానీ ఘన విజయం
- బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించిన నత్వానీ
- కేవలం 20 ఓట్లకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి
- జేఎమ్ఎమ్ అభ్యర్థి బైద్యనాథ్ రామ్‌కు లభించిన 30 ఓట్లు.. రాజ్యసభకు ఎన్నిక
- నత్వానీ గెలుపుతో రాజ్యసభలో 153కు చేరిన ఎన్డీఏ కూటమి బలం

**రాంచీ, వెలుతురు జూన్ 18:**

జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల్లో అధికార మహాగఠ్‌బంధన్ (ఇండియా కూటమి) లోని కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు రాజ్యసభ స్థానాలకు జరిగిన హోరాహోరీ పోరులో బీజేపీ మద్దతు ఉన్న స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నత్వానీ 28 ఓట్లు సాధించి ఘన విజయం సాధించారు. నిజానికి ఆయనకు 30 ఓట్లు పోల్ అవ్వగా.. అందులో రెండు ఓట్లు చెల్లకుండా పోవడంతో, విజయానికి అవసరమైన ఖచ్చితమైన సంఖ్య (28 ఓట్లు) తో ఆయన గట్టెక్కారు. మరోవైపు గ్రాండ్ అలయన్స్ తరపున బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝా కేవలం 20 ఓట్లు మాత్రమే సాధించి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. కాగా, జార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి బైద్యనాథ్ రామ్ 30 ఓట్లతో సులువుగా విజయం సాధించి రాజ్యసభకు ఎన్నికయ్యారు.పరిమళ్ నత్వానీ విజయం సాధించడంపై జార్ఖండ్ బీజేపీ లోక్‌సభ ఎంపీ నిషికాంత్ దూబే 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీఏ మద్దతు ఉన్న అభ్యర్థి నత్వానీ ఘన విజయం సాధించారని, కాంగ్రెస్ అభ్యర్థి కేవలం 20 ఓట్లకే పరిమితమవడంతో రాష్ట్రాన్ని పాలిస్తున్న గ్రాండ్ అలయన్స్ ఘోర పరాజయాన్ని చవిచూసిందని ఆయన విమర్శించారు. ఈ గెలుపుతో దేశవ్యాప్తంగా రాజ్యసభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి, దాని భాగస్వామ్య పక్షాల మొత్తం బలం 153 స్థానాలకు చేరుకుంది. పశ్చిమ బెంగాల్ నుంచి నలుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో ప్రస్తుతం ఎగువసభ మొత్తం బలం 241గా ఉంది.తన విజయంపై పరిమళ్ నత్వానీ తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగోసారి రాజ్యసభ సభ్యుడిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. 2008లో తన పార్లమెంటరీ ప్రస్థానం ప్రారంభమైన జార్ఖండ్ గడ్డ నుంచే మూడోసారి ఎగువసభకు ఎన్నిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ నేత నితిన్ నవీన్ తదితర ఎన్డీఏ పెద్దలకు, అలాగే తనకు ఓటు వేసిన జార్ఖండ్ ఎమ్మెల్యేలందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.జార్ఖండ్‌లోని 81 మంది ఎమ్మెల్యేలు ఉన్న శాసనసభలో 2 స్థానాల కోసం ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవడంతో ఈ ఎన్నికలు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తించాయి. సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా జేఎమ్ఎమ్, కాంగ్రెస్ పార్టీలు చెరొక అభ్యర్థిని నిలపగా.. బీజేపీ వ్యూహాత్మకంగా స్వతంత్ర అభ్యర్థి అయిన నత్వానీకి మద్దతు ప్రకటించింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత ప్రదీప్ యాదవ్ తదితర ప్రముఖులంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన కౌంటింగ్‌లో కాంగ్రెస్ ఓట్లు చీలిపోవడంతో ఎన్డీఏ వ్యూహం పారినట్లయింది.

# కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

- 5 స్థానాల్లో ఘన విజయం
- బీజేపీ, జేడీఎస్ కూటమికి గట్టి షాక్ ఇస్తూ ఐదు చోట్లా కాంగ్రెస్ జయకేతనం
- ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నాయకత్వానికి దక్కిన భారీ నైతిక విజయం
- సొంత బలానికి మించి 151 ఓట్లను సాధించి సత్తా చాటిన అధికార పక్షం
- కాంగ్రెస్ సంక్షేమ గ్యారంటీలకు ఎమ్మెల్యేలు ఇచ్చిన తిరుగులేని తీర్పు

**బెంగళూరు, వెలుతురు జూన్ 18:**



కర్ణాటక శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 7 స్థానాలకు జరిగిన ఈ హోరాహోరీ పోరులో ఏకంగా 5 స్థానాలను కైవసం చేసుకుని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ కూటమికి కోలుకోలేని షాక్ ఇచ్చింది. ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నాయకత్వంలో జరిగిన ఈ మొదటి ప్రతిష్టాత్మక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు బి.కె. హరిప్రసాద్, తిప్పణ్ణప్ప కమకనూర్, పి.వి. మోహన్, శివన్న మళవల్లి, వినయ్ కార్తీక్ అద్భుత విజయాలను సాధించారు. ఫలితాలు వెల్లడైన వెంటనే ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ విజేతలకు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ.. ఈ విజయం కాంగ్రెస్ ఐక్యతకు నిదర్శనమని, రాష్ట్ర ప్రగతిలో వీరి పాత్ర మరువలేనిదని కొనియాడారు.ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మాట్లాడుతూ.. అసలు ఈ ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని భావించామని, కానీ బీజేపీ, జేడీఎస్ కావాలనే పోటీకి దిగాయని విమర్శించారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నిఖార్సైన కార్యకర్తలనే తాము బరిలోకి దించామని చెప్పారు. శాసనసభలో కాంగ్రెస్‌కు స్పష్టమైన తీర్పు లభించిందని, పార్టీల పొత్తులు, సిద్ధాంతాలను పక్కనబెట్టి అనేకమంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా కాంగ్రెస్‌కే ఓటు వేశారని వెల్లడించారు. తమకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా ఈ విజయంపై స్పందిస్తూ.. ఇది సానుకూల రాజకీయాలకు లభించిన అఖండ విజయమన్నారు. సభలో కాంగ్రెస్ బలం 135 ఓట్లు మాత్రమే అయినప్పటికీ, ఏకంగా 151 ఓట్లు సాధించడం విశేషమన్నారు. మరోవైపు ప్రతిపక్షాలు తమకు రావాల్సిన ఓట్లను కూడా కాపాడుకోలేకపోయాయని ఎద్దేవా చేశారు. బీజేపీ తన 64 ఓట్లలో 7 ఓట్లను కోల్పోగా, జేడీఎస్ తనకున్న 18 ఓట్లకు బదులుగా కేవలం 14 ఓట్లు మాత్రమే సాధించగలిగిందని లెక్కలతో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, మహిళల కోసం ఏడాదికి రూ. 56,000 కోట్లతో అమలు చేస్తున్న 5 ముఖ్యమైన గ్యారంటీ పథకాలను రద్దు చేయాలని చూసిన ప్రతిపక్షాలకు వారి సొంత ఎమ్మెల్యేలే ఓట్ల రూపంలో అవిశ్వాసం ప్రకటించారని మండిపడ్డారు.

విజేతలుగా నిలిచిన తిప్పణ్ణప్ప కమకనూర్, పి.వి. మోహన్, శివన్న మళవల్లి తదితరులు తమ గెలుపును పార్టీ శ్రేణులకు, అగ్ర నాయకత్వానికి అంకితం చేశారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం పేదల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి కోసం పాటుపడతామని స్పష్టం చేశారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ తరపున రఘు ఆర్. కౌటిల్య ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. వెనుకబడిన వర్గాల ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించిన అగ్ర నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. విధానసౌధలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 222 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయడంతో 100 శాతం పోలింగ్ నమోదైంది. ఈ విజయంతో శాసనమండలిలో కాంగ్రెస్ తన పట్టును మరింత బలంగా మార్చుకుంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించాలి: కలెక్టర్ చంద్రశేఖర్

**నల్గొండ, వెలుతురు జూన్ 18:**

నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి వైద్యుడు విధులకు సమయానికి హాజరుకావాలని, రోజూ ఉదయం 10 గంటలలోపు వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని సూచించారు. హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలు, ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించిన కలెక్టర్, ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అవసరమైన పరికరాలను సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేసి ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, డాక్టర్ నగేష్, ప్రభుత్వ వైద్యులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



# రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్..

## వెంకటేశ్ - కళ్యాణ్‌రామ్ - అనిల్ సినిమా మొదలు



కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అనిల్ దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో ఓ సినిమా రానుంది. 'VenkyAnil5' అనే వర్కింగ్ టైటిల్‌తో ఇది ప్రచారంలో ఉంది. ఈ చిత్రం షూటింగ్ నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాఘవేంద్రరావు, దిల్‌రాజు, సురేశ్ బాబు, అల్లు అరవింద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్ చిత్రీకరణ జరగ్గా.. ఈ సినిమా రూ.200 కోట్లు వసూళ్లు సాధించాలని కోరుకుంటూ అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్‌రాజు స్క్రిప్ట్ అందించి టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఇందులో వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తున్నారు. వెంకటేశ్ – అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో గతేడాది పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. 2027 సంక్రాంతి లక్ష్యంగా శరవేగంగా షూటింగ్ జరగనుంది. ఇక వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం:47' అనే సినిమా చేస్తున్నారు.

# రామోజీ ఫిల్మ్‌సిటీలో 'డ్రాగన్' సందడి



'పొరపాటున కూడా నా కల్లోకి రావొద్దు' అంటూ 'డ్రాగన్' సినిమాతో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రహీరో ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాల్ని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరిస్తున్నారు. ఎన్టీఆర్‌తో పాటు ఇతర తారాగణంపై ఈ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. అనిల్ కపూర్, బిజూ మేనన్, ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఇందులో ఎన్టీఆర్ లూగర్ అనే శక్తిమంతమైన పాత్రలో అలరించనున్నారు.

# దెబ్బలు తగిలాయి.. రక్తం కారింది...



సమంత ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ ఫ్యామిలీ యాక్షన్–కామెడీ డ్రామా చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకలో సమంత మాట్లాడుతూ.. ఇందులో తాను చేసిన యాక్షన్ సీక్వెన్స్‌ల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. స్టంట్స్ సహజంగా ఉండడం కోసం తాను పడిన కష్టాన్ని సమంత వివరించారు. "ఇందులో ఎలాంటి స్లో–మోషన్ సీక్వెన్స్‌లు, గాల్లో ఎగిరే షాట్లు, అనవసరపు బిల్డప్‌లు ఉండవు. ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది. సినిమాలో చూపించిన యాక్షన్ సన్నివేశాలన్నీ నిజమైనవి. వాటిలో నటిస్తున్నప్పుడు నాకు చాలా దెబ్బలు తగిలాయి. రక్తం కూడా వచ్చింది. ఎంత కష్టమైన సన్నివేశాల్లో అయినా డూప్ ఉపయోగించలేదు. అందుకే చాలా సహజంగా వచ్చాయి. కచ్చితంగా అందరికీ నచ్చుతాయి" అని ధీమా వ్యక్తంచేశారు. తనకు డ్యాన్స్ కంటే యాక్షన్ సన్నివేశాల్లో నటించడమంటేనే ఇష్టమని తెలిపారు. తన సొంత బ్యానర్‌పై ఈ సినిమాను సమంత నిర్మించారు. U/A సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకురానుంది.

# డబుల్ సెంచరీ చేయాలనుకున్నా..!

## 154 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్‌పై శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యలు!



అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో వన్డేలో 154 పరుగుల సునామీ ఇన్నింగ్స్‌తో భారత్‌కు భారీ విజయాన్ని అందించిన ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో తాను ద్విశతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని, అయితే దురదృష్టవశాత్తూ ఆ మైలురాయిని అందుకోలేకపోయానని గిల్ అంగీకరించాడు. లక్నో పిచ్‌పై అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ అఫ్గాన్ బౌలర్లను అతడు నలుమూలలా ఉతికేశాడు.

మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ.. "క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోరు చేయాలనేది నా ప్రణాళిక. ఒకానొక దశలో డబుల్ సెంచరీ చేసే అవకాశం ఉందని పించింది, అందుకే ఆ దిశగా వేగంగా ఆడటానికి ప్రయత్నించాను. కానీ అవుట్ అవ్వడం కొద్దిగా నిరాశ కలిగించినా.. జట్టు భారీ స్కోరు సాధించడంలో నా వంతు పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది" అని తెలిపాడు. వన్డేల్లో గిల్‌కు ఉన్న పాత రికార్డుల దృష్ట్యా, అతడు క్రీజులో ఉన్నంతసేపు మరో ద్విశతకం ఖాయమని అభిమానులు కూడా భావించారు.

ఈ మ్యాచ్‌లో గిల్ సెంచరీతో కదం తొక్కడంతో టీమిండియా అఫ్గానిస్తాన్‌పై స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. ఈ సిరీస్‌లో గిల్ వరుసగా అద్భుత ప్రదర్శనలు చేస్తూ జట్టు విజయాల్లో కీలక భూమిక పోషిస్తున్నాడు. రాబోయే మ్యాచ్‌ల్లోనూ ఇదే రకమైన ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టుకు మరిన్ని విజయాలు అందించడమే తన ముందరి లక్ష్యమని ఈ యువ ఓపెనర్ స్పష్టం చేశాడు.

# బిహార్‌లో మరో సంచలనం

## 126 బంతుల్లో 306 పరుగులు చేసిన అక్షర గుప్తా!



భారత దేశవాళీ క్రికెట్‌లో బిహార్ యువ ఆటగాళ్లు సరికొత్త చరిత్ర సృష్టిస్తూ వెలుగులోకి వస్తున్నారు. ఇటీవల ఇండియా 'ఎ' జట్టు తరఫున ఆడుతూ వార్తల్లో నిలిచిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తర్వాత.. ఇప్పుడు బిహార్‌కే చెందిన మరో యువ సంచలనం అక్షర గుప్తా మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించాడు. స్థానిక టోర్నమెంట్‌లో కేవలం 126 బంతుల్లోనే ఏకంగా 306 పరుగుల త్రిశతకంతో ఇన్నింగ్స్ ఆడి అందరి దృష్టిని ఆకర్షించాడు.

ఈ అసాధారణ ఇన్నింగ్స్‌లో అక్షర గుప్తా మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపిస్తూ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఒక బ్యాటర్ ఈ స్థాయిలో చెలరేగి 300కు పైగా పరుగులు సాధించడం క్రీడా వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. అతని అద్భుతమైన టైమింగ్, భారీ షాట్లు ఆడే సామర్థ్యం చూస్తుంటే భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మరో నాణ్యమైన హిట్టర్ దొరికినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

బిహార్ నుంచి వరుసగా వైభవ్ సూర్యవంశీ, ఇప్పుడు అక్షర గుప్తా వంటి యువ ప్రతిభావంతులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడంపై స్థానిక క్రీడా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే బిహార్ నుంచి మరింత మంది అద్భుతమైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారని ఈ ప్రదర్శనలు నిరూపిస్తున్నాయి. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అక్షర గుప్తా సాధించిన ఈ రికార్డు స్కోరుపై నెటిజన్లు, క్రీడా అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# గుర్నూర్ బ్రార్ ఎంపికపై గవాస్కర్ ప్రశంసలు



సెలెక్టర్ల నిర్ణయం భేష్ అంటూ వ్యాఖ్యలు!

అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ కోసం 26 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్‌ను భారత జట్టులోకి ఎంపిక చేయడంపై లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. దేశవాళీ క్రికెట్‌లో స్థిరమైన ప్రదర్శన చేస్తున్న యువ ప్రతిభను గుర్తించి, వారికి సరైన సమయంలో అంతర్జాతీయ వేదికపై అవకాశం కల్పించినందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెలెక్టర్లను ఆయన అభినందించారు.

పొడగరి అయిన గుర్నూర్ బ్రార్‌కు పిచ్ నుంచి అదనపు బౌన్స్ రాబట్టే సామర్థ్యం ఉందని, ఆధునిక క్రికెట్‌కు ఇలాంటి వైవిధ్యం ఉన్న బౌలర్లు ఎంతో అవసరమని గవాస్కర్ పేర్కొన్నారు. కేవలం ఐపీఎల్ ప్రదర్శనల ఆధారంగానే కాకుండా, ఫస్ట్–క్లాస్ క్రికెట్ గణాంకాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక జరగడం శుభపరిణామన్నారు. అఫ్గాన్ లాంటి ప్రమాదకరమైన జట్టుపై గుర్నూర్‌కు లభించిన ఈ అవకాశం అతని కెరీర్‌కు ఒక పెద్ద మలుపు కానుందని ఆయన అభిప్రాయపడ్డారు.

భారత పేస్ బౌలింగ్ విభాగంలో మరింత లోతును పెంచడానికి సెలెక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తు సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని చేసిందేనని విశ్లేషకులు భావిస్తున్నారు. సీనియర్ బౌలర్ల గైర్హాజరీలో లేదా వారికి విశ్రాంతినిచ్చే సమయంలో గుర్నూర్ బ్రార్ వంటి యువ బౌలర్లు తమ సత్తా చాటితే టీమిండియా బెంచ్ బలం మరింత బలపడుతుందని క్రీడా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## రామంతాపూర్ చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం



**ఉప్పల్ ,వెలుతురు జూన్ 18 :**

నగరంలో వరదల నివారణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా హైడ్రా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ప్రారంభించారు. భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.రామంతాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 30 ఎకరాలు కాగా, అందులో 16 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో 12 ఎకరాల్లో శాశ్వత నిర్మాణాలు ఉండగా, మిగిలిన 4 ఎకరాల్లోని తాత్కాలిక షెడ్లు, గుడిసెలను తొలగించి 18 ఎకరాలకు పైగా భూమిని చెరువు పునరుద్ధరణ కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పనులకు సుమారు రూ.19 కోట్లు వ్యయం చేయనున్నారు.చెరువు అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల్లో వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరగడానికి, పర్యావరణ సమతుల్యత మెరుగుపడడానికి దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆదిభట్లలో అద్భుతమైన విందు వేదిక.. 'పార్క్ ఇన్ -35' బ్యాంకెట్ హాల్






**వెలుతురు, ఇబ్రహీంపట్నం జూన్ 18:**

మీ ఇంట్లో శుభకార్యం ఉందా..? ఆ ఈవెంట్‌ను అద్భుతంగా నిర్వహించాలని అనుకుంటున్నారా..? మరి ఇంకెందుకు ఆలస్యం.. ఆదిభట్ల పరిధిలోని టీసీఎస్ సమీపంలో మనముందుకు వచ్చింది.. పార్క్ ఇన్ – 35 బ్యాంకెట్ హాల్. అత్యంత ఆధునిక, అద్భుతమైన సదుపాయాలతో కూడిన ఈ బ్యాంకెట్ హాల్‌ను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు.

ఈ హాల్ ప్రత్యేకతలు:

కెపాసిటీ: దాదాపు 200 మంది అతిథులతో సౌకర్యవంతంగా విందు, వేడుకలు జరుపుకోవచ్చు.

లుక్: చూడగానే ఆకట్టుకునేలా అద్భుతంగా, విలాసవంతంగా ఉంటుంది.

సదుపాయాలు: కస్టమర్ల సౌకర్యార్థం అన్ని రకాల అధునాతన వసతులు కల్పించినట్లు మేనేజర్ నందికంత చంద్రశేఖర్ తెలిపారు. పుట్టినరోజులు, ఎంగేజ్ మెంట్ ఈవెంట్, చిన్నపాటి శుభకార్యాలకు ఇది ఒక పర్‌ఫెక్ట్ ఛాయిస్. మీ వేడుకలను అద్భుతంగా నిర్వహించుకోవాలనుకుంటే.. వెంటనే 8712380888 నంబర్‌లో సంప్రదించండి. ఈ విలాసవంతమైన బంకెట్ హాల్ ను బుక్ చేసుకోండి.

## ధాబాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్,వెలుతురు జూన్ 18 :**



జిల్లా వ్యాప్తంగా జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై ఉన్న ధాబాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ధాబా యజమానులు,నిర్వాహకులతో డీఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ధాబాల్లో మద్యం సేవించడం, మద్యం విక్రయాలు, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం లేదా అమ్మకాలు పూర్తిగా నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన యజమానులు, నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే బైండోవర్ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి ధాబాలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, వచ్చే వెళ్లే వ్యక్తులు, వాహనాలు, పరిసర ప్రాంతాలు స్పష్టంగా రికార్డు అయ్యేలా చూడాలని సూచించారు. ధాబాలకు వచ్చే వాహనాలను కేవలం పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి ఉంచాలని, రహదారులపై పార్కింగ్ చేయరాదన్నారు.అనుమానాస్పద వ్యక్తులు, ఆయుధాలు, గంజాయి లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.సమావేశంలో సీఐలు బి. సునీల్ కుమార్, బి.డి. ప్రేమ్ కుమార్, రహీం పాషా, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వలస ఆదివాసీల అభివృద్ధికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది: డీఎస్పీ అరుణ్ కుమార్

**భద్రాచలం, వెలుతురు జూన్ 18 :**

దుమ్ముగూడెం మండలంలోని గద్దమడుగు గోత్తికోయ గుంపు, కొత్తపల్లి గ్రామాల్లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో డీఎస్పీ అరుణ్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వలస ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

ఆదివాసీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, యువత చదువుల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించిన ఆయన, అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు.అనంతరం గ్రామస్తులకు గృహావసర వస్తువులు, విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటప్పయ్య, ఎస్సై జగన్మోహన్ చారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి.. 30 ట్రాక్టర్ల ఇసుక సీజ్

**కరీంనగర్, వెలుతురు జూన్ 18 :**



కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు గురువారం కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల గ్రామ పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.


ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపును గుర్తించి సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఇసుక పరిమాణం సుమారు 30 ట్రాక్టర్ల లోడ్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తెలంగాణ చైతన్య భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఎల్‌బీ నగర్,వెలుతురు జూన్ 18 :**

సింగరేణి కాలనీలో తెలంగాణ చైతన్య భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం సంస్థ ఉపాధ్యక్షులు ఏలూరు బాబు ఆధ్వర్యంలో జరిగింది. సంఘం సింగరేణి కాలనీ నూతన అధ్యక్షుడిగా వల్లంపట్ల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బి. నాగేష్ బాబు, కార్యదర్శులుగా పి. సురేష్, ఈ. వెంకటేష్, ఖజాంచీగా రాజు, సంయుక్త కార్యదర్శులుగా మురళి, దర్గయ్య, గౌస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సాయికుమార్, రవిలను నియమించారు.ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సమష్టిగా పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. సంఘ బలోపేతానికి ప్రతి కార్మికుడు సహకరించాలని పిలుపునిచ్చారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com